Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 | సంచిక : 312 | పేజీలు 8 | వెల : 5 | ఆదివారం 13 ఏప్రిల్ 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజీ |
| బ్యాక్ కవర్ పేజీ మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజీ : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజీ : 20,000/- | ఇన్నర్ పేజీ : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజీ : 70,000/- | ఫ్రంట్ పేజీ : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

# సంఘటితంతోనే హిందూ రాజ్యం సాధ్యం



సుల్తాన్‌బజార్: హిందువులంతా సంఘటితమైతేనే హిందూ రాజ్యం సాధ్యమవుతుందని వీహెచ్‌పీ జాతీయ నేత, మాజీ ఎంపీ రాంవిలాస్ వేదాంతి పేర్కొన్నారు. హనుమంతుడిని ఆదర్శంగా తీసుకుని హిందూ ధర్మరక్షణకు యువత కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'వీరహనుమాన్ విజయ్ యాత్ర'ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే కాకుండా ప్రపంచమంతా హిందూ జీవన విధానానికి అలవాటు పడుతున్నారని చెప్పారు. అయోధ్యలో రామమందిర నిర్మాణంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది హిందువుల కల సాకారమైందన్నారు. హైదరాబాద్ నగరం పేరును భాగ్యనగర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, భాజపా ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్‌రావు, వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, పగుడాకుల బాలస్వామి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా, గౌలిగూడ రామ మందిరం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర వివిధ ప్రాంతాల మీదుగా తాడ్‌బండ్ దేవాలయం వరకు కొనసాగింది.



## అమెరికా-చైనా దేశాల మధ్య సుంకాల యుద్ధం

### బంగారం ధరలకు భారీగా రెక్కలు

### ఐదుశాతానికి పడిపోయిన బంగారం కొనుగోళ్లు

ముంబయిలో 24 క్యారెట్ల బంగారం శనివారం మధ్యాహ్నం వరకు పది గ్రాములకు రూ.96,600కి చేరగా.. 22 క్యారెట్స్ గోల్డ్ రూ.87,460 వద్ద కొనసాగింది.




# ఎపిలో ఇంటర్ ఫలితాలు విడుదల

**అమరావతి:** ఏపీ ఇంటర్ ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 70 శాతం ఉత్తీర్ణత సాధించగా.. రెండో ఏడాదిలో 83 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో అత్యధిక ఉత్తీర్ణత శాతం ఈ ఏడాది నమోదైందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఇంటర్‌లో మంచి ఫలితాలు వచ్చేందుకు అధ్యాపకులు, సిబ్బంది కృషి చేశారని కొనియాడారు. ఇంటర్ తొలి ఏడాది ఫలితాల్లో 85 శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లాకు అగ్రస్థానం దక్కింది. రెండో ఏడాది ఫలితాల్లో 93 శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లాకు ప్రథమ స్థానం లభించింది. తొలి ఏడాది ఫలితాల్లో 54 శాతం ఉత్తీర్ణతతో చిత్తూరు జిల్లాకు చివరి స్థానం వచ్చింది. రెండో ఏడాది ఫలితాల్లో 73 శాతం ఉత్తీర్ణతతో అల్లూరి జిల్లా ఆఖరి స్థానంలో నిలిచింది.

ఇంటర్ ఫస్ట్, సెకండియర్ ఫలితాలను ఒకేసారి రిలీజ్ అయ్యాయి. ఈ పరీక్షల్లో పదేళ్లలో కంటే అత్యధిక శాతం ఉత్తీర్ణత నమోదు అయ్యింది. శనివారం ఉదయం సోషల్



మీడియా ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేష్ ఏపీ ఇంటర్ ఫలితాలను విడుదల చేశారు. ఈసారి అత్యధికంగా పాస్ పర్సంటేజ్ నమోదు అవడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. రెండో సంవత్సరంలో 83 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. ప్రతీఏడు లాగే ఈ ఏడాది కూడా ఇంటర్ ఫలితాల్లో బాలికదే పై చేయిగా నిలిచింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో బాలికలు 71 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 64 శాతం ఉత్తీర్ణత పొందారు. అలాగే ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 81 శాతంతో బాలికలు ఉత్తీర్ణత పొందగా.. బాలురు 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇదిలా ఉండగా.. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ బోర్డు కీలక సమాచారం ఇచ్చింది. ఈ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై ఇంటర్ బోర్డు అధికారులు ముఖ్య ప్రకటన చేశారు. మే 12 నుంచి ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ జరుగనుంది. మే 12 నుంచి 20 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఏప్రిల్ 15 వరకు సప్లెమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లించాల్సిందిగా బోర్డు తెలిపింది. ఏప్రిల్ 22 వరకు చివరి తేదీగా ప్రకటించింది. అలాగే సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరుగనున్నాయి. ఫెయిల్ అయిన విద్యార్థులు ఎలాంటి ఆందోళన పడకుండా.. సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని అధికారులు కోరుతున్నారు.

**ప్రథమంలో 70..ద్వితీయలో 83శాతం ఉత్తీర్ణత**

**ఫస్టియర్‌లో 85శాతం..సెకండియర్‌లో 93శాతంతో కృష్ణ ఫస్ట్**

**71శాతంతో ఇంటర్ ఫలితాల్లో బాలికదే పై చేయి**

**సోషల్ మీడియా వేదికగా మంత్రి లోకేశ్ ఫలితాలు విడుదల**



## 3 నెలల్లోగా బిల్లులు ఆమోదించాల్సిందే

### మంత్రిమండలి నిర్ణయాలు గవర్నర్ గౌరవించాలి

### సుప్రీం తీర్పుతో 10బిల్లులపై తమిళనాడు గెజిట్ విడుదల

ఏదైనా బిల్లును మంత్రిమండలి సలహా మేరకు రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సివస్తే అందుకు గవర్నర్ తీసుకోదగిన అత్యధిక గడువు ఒక నెల మాత్రమేనని సంచలనాత్మక తీర్పు వెలువరించింది.

# అంబేడ్కర్‌ను గౌరవించిన ఘనత బిజెపిదే

**60 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదు**

**బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి**




# శివాజీ చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

**మాతృభూమికిసే చేసేందుకు శివాజీ స్ఫూర్తి రావాలి**

**కేంద్రహోంమంత్రి అమిత్ షా**



## బిఆర్ఎస్ రజతోత్సవ సభకు అనుమతి ఎందుకివ్వరు

హైదరాబాద్: 2025 సంవత్సరం బీఆర్ఎస్ పార్టీకి కీలకమని పేర్కొన్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హన్మకొండ సమీపంలోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు పోలీసులు అనుమతులు ఇవ్వలేదని ఆరోపించారు. మార్చి 28న అనుమతికి దరఖాస్తు చేసినప్పటికీ ఇంకా ప్రతిస్పందన లేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీకగా బీఆర్ఎస్ పార్టీ నిలిచిందని, రాష్ట్రం రూపుదిద్దుకునే దశలో పుట్టిన ఈ పార్టీ ఇప్పటికీ అరవై లక్షల సభ్యులను కలిగి ఉందన్నారు. రజతోత్సవం ప్రభుత్వానికి విరుద్ధంగా నిర్వహించే సభ కాదు, ఇది మేం ప్రతి సంవత్సరం జరుపుకునే వార్షికోత్సవ సభ మాత్రమేనని స్పష్టం చేశారు. బస్సుల కోసం ఇప్పటికే ...10 కోట్లను చెల్లించామని, ఈ సభ అనంతరం ఏడాది పాటు- రజతోత్సవ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. కంచె గచ్చిబౌలి భూముల వివాదాన్ని ప్రస్తావించిన కేటీ-ఆర్, ఆ భూములను ఎవరైనా కొనుగోలు చేస్తే మేము అధికారంలోకి వచ్చాక తిరిగి రికవరీ చేస్తాం అని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పెద్ద ఫేక్‌గా అభివర్ణించిన కేటీ-ఆర్, ఆయన బదులుగా అపరిచితుడు అని విమర్శించారు. తమ హయంలో ప్రభుత్వ సంస్థల భూముల అమ్మయిని అంగీకరించిన కేటీఆర్, ప్రస్తుత బ్రోకర్ల చేతిలో భూములు అమ్ముబడుతున్నాయంటూ ఆరోపించారు. పదివేల కోట్ల రుణం కోసం రూ.170 కోట్లు బ్రోకర్ కమిషన్ చెల్లించారని, బీజేపీ ఎంపీ , బొంబాయి బ్రోకర్ కలిసి తాకట్టు పెట్టారని ఆరోపించారు. మూసీ నదిపై జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకునేలా ప్రజలను దారి తప్పిస్తున్నారని, ఈ ప్రాజెక్టు వెనక లక్షా 50 వేల కోట్ల అవినీతి దాగి ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతికి కళ్లెం వేసే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని స్పష్టం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ వేరేవేరు అని అనుకుంటే విచారణకు ఆదేశించండి అంటూ సవాల్ విసిరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**జనగామ:** రైతు సంక్షేమం, పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. లింగాల ఘనపూర్ మండలానికి అశ్వరావుపల్లి కుడి కాలువ ద్వారా మొట్ట మొదటిసారి గోదావరి జలాలు తీసుకురాగలిగామని శ్రీహరి అన్నారు..లింగాల ఘనపూర్ మండలం సిరిపురం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు- చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యానికి మద్దతు ధర అందించడంతో పాటు సన్నాలకు 500బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. సన్నాలకు 2320 రూపాయలు, దొడ్డ రకానికి 2300రూపాయల మద్దతు ధర అందిస్తున్నట్లు వెల్లడించారు. బయట మార్కెట్ లో తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకొని రైతులు నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 25లక్షల మంది రైతులకు 21వేల కోట్ల రుణ మాఫీ, రైతు భరోసా, సన్నాలకు 500బోనస్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం మాత్రమేనని తెలిపారు. సిరిపురం గ్రామంలో త్రాగు నీటి సమస్య ఉన్న విషయం నా దృష్టికి వచ్చిందని వారం రోజులలో త్రాగు నీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అశ్వరావుపల్లి కుడి కాలువ ద్వారా లింగాల ఘనపూర్ మండలంలోని ప్రతీ ఎకరానికి సాగు నీరు అందిస్తానని అన్నారు. జనగామ నుండి జీడికల్ రోడ్డు జూన్ లోగా పూర్తి చెస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మండల అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## 400 ఎకరాలు ఎవరికి తాకట్టుపెట్టారు

**హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూములను మేము తనఖా పెట్టుకోలేదని ఐసీఐసీఐ బ్యాంకు విడుదల చేసిన ప్రకటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. టీ-జీఐఐసీ ద్వారా 400 ఎకరాలు తనఖా పెట్టి రుణం పొందామని అసెంబ్లీలో నేను అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పింది. మరి నేడు ఐసీఐసీఐ బ్యాంక్ మేము తనఖా పెట్టుకోలేదు అని చెబుతోంది. అంటే ఆ 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూమిని ప్రభుత్వం ఎవరి వద్ద తనఖా పెట్టినట్లు-? రేవంత్ రెడ్డి తన బ్రోకర్ కంపెనీలకు తనఖా పెట్టారా ? 400 ఎకరాల తనఖా విషయంలో దాగి ఉన్న చీకటి కోణం ఏమిటి? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిమీద శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. మేము తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కి(టీ-ఎస్ఐఐసీ) ఎటు-వంటి మార్టిగేజ్ రుణం అందించలేదని, అలాగే ఈ బాండ్ల జారీకి సంబంధించి టీ-ఎస్ఐఐసీ మా వద్ద ఎట్టి స్థలాన్ని మార్టిగేజి చేయలేదని స్పష్టంగా తెలియజేయదల్చు కున్నాము. మేము కేవలం బాండ్ల జారీ ద్వారా వచ్చే నిధుల స్వీకరణ, వడ్డీ చెల్లింపునకు సంబంధించి టీ-ఎస్ఐఐసీకి అకౌంటు- బ్యాంకుగా మాత్రమే వ్యవహరించాము.'

## 3 నెలల్లోగా బిల్లులు ఆమోదించాల్సిందే

న్యూఢిల్లీ:రాష్ట గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతికి నిర్దిష్ట టైమ్‌లైన్ విధిస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతి 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమిళనాడుకు అసెంబ్లీ ఆమోదించిన 10 బిల్లులను రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆపి ఉంచడంపై నాలుగు రోజుల క్రితం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేంది. ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ ఆ బిల్లులకు క్లియరెన్స్ ఇచ్చింది. ఏదైనా బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సి వస్తే గవర్నర్ తీసుకోవాల్సిన అత్యధిక గడువు నెలరోజులు మాత్రమేనని తీర్పు ఇచ్చింది. 415 పేజీలతో కూడిన పూర్తి తీర్పును శుక్రవారం రాత్రి 10.54 గంటలకు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఉంచారు. కాగా, గవర్నర్లు పంపే బిల్లుపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లో కూడిన ధర్మాసం తాజాగా తీర్పునిచ్చింది. ఏదైనా జాప్యం జరిగితే రాష్ట్రపతి భవన్ అందుకు కారణాలను రాష్ట్రాలకు వివరించాలని, నిర్దేశిత గడువులోగా రాష్ట్రపతి నుంచి స్పందన లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు మాండమస్ రిట్ పిటిషన్ దాఖలు చేయవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. రాజ్యాంగంలోని 200వ అధికారణ ప్రకారం మంత్రిమండలి సలహా సూచనల మేరకు గవర్నర్లు తప్పనిసరిగా వ్యవహరించాల్సి ఉంటుందని, రెండోసారి సమర్పించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వ్ చేసే అధికారం గవర్నర్లకు లేదని మార్చి 8న ఇచ్చిన తీర్పులో సుప్రీం ధర్మాసనం తెలిపింది. నిర్దిష గడువులోగా గవర్నర్ చర్య తీసుకోకుంటే గవర్నర్ చర్య జ్యుడిషియల్ స్క్రూటినీని ఎదుర్కోవలిసి వస్తుందని హెచ్చరించింది. కాగా, గవర్నర్ తొక్కిపెట్టిన 10 బిల్లులకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పది చట్టాలను నోటిఫై చేసింది. ఇందుకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం 10 చట్టాలను నోటిఫై చేయడం రాజ్యంగ చరిత్రలో ఇదే మొదటిసారి. శాసన సభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ సమ్మతించకపోవడం, పునఃపరిశీలనకు కూడా పంపకపోవడంపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, గవర్నర్ తీరును అత్యున్నత న్యాయస్థానం తప్పుపడుతూ ఆ 10 బిల్లులకు మార్చి 8న క్లియరెన్స్ ఇచ్చింది. ఈ క్రమంలో దేశ చరిత్రలో తొలిసారి రాష్ట్రపతి, గవర్నర్ అనుమతి లేకుండా 10 బిల్లులు ఆమోదం పొందాయి. తమిళనాడుకు చెందిన పెండింగ్ బిల్లులు ఆమోదించినట్లుగా ఇటీవల దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. తాజాగా తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రపతి, గవర్నర్ ఆమెదం లేకుండానే 10 చట్టాలను నోటిఫై చేసింది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజ్యాంగ చరిత్రలో ఇలా జరగడం ఇదే తొలిసారి. అసెంబ్లీ ఆమోదం తెలిపిన బిల్లులను గవర్నర్ తన దగ్గరే ఉంచుకున్నారని.. దీనికి ఎలాంటి సమాధానం ఇవ్వలేదని ఆరోపిస్తూ స్టాలిన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వెనక్కి పంపిన బిల్లులను తిరిగి పంపితే.. రెండోసారి ఆమోదించి పంపినా ఆమోదం తెల్పలేదని పేర్కొంది. దీంతో సుప్రీం ధర్మాసనం.. ఆ బిల్లులు ఆమోదించినట్లుగా పేర్కొంది. ఈ సందర్భంగా గవర్నర్ తీరును తీవ్రంగా తప్పుపట్టింది. బిల్లులు ఆమోదించకుండా ఎందుకు తొక్కిపెట్టారని నిలదీసింది. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమని తమిళనాడు సీఎం స్టాలిన్ అభివర్ణించిన సంగతి తెలిసిందే.

## అంబేడ్కర్‌ను గౌరవించిన ఘనత బిజెపిదే

విజయవాడ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను గౌరవించింది భారతీయ జనతా పార్టీ మాత్రమే అని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చి పార్లమెంట్‌లో ఆయన చిత్రపటం పెట్టాం అని, 60 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. 106 సార్లు సవరణ జరిగిన రాజ్యాంగంలో అధిక శాతం కాంగ్రెస్ స్వలాభం కోసం సవరణలు జరిగాయని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ కాలంలో జరిగిన 22 సవరణలు సామాజిక న్యాయం దృష్టిలో పెట్టు-కుని చేసినవే అని పురంధేశ్వరి పేర్కొన్నారు. ఏపీ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకల నిర్వహణపై రాష్ట్రస్థాయి కార్యాచరణ సమావేశానికి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరితో పాటు జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ హాజరయ్యారు. ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ... 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమసమాజ స్థాపనకు కృషి చేశారు. 2014 ఎన్నికల్లో విపక్షాలు మా పట్ల దుష్ప్రచారం చేశాయి. అంబేద్కర్‌ను గౌరవించింది బీజేపీ మాత్రమే. అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చి పార్లమెంట్‌లో ఆయన చిత్రపటం పెట్టాం. 60 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదు. 106 సార్లు సవరణ జరిగిన రాజ్యాంగంలో అధిక శాతం కాంగ్రెస్ స్వలాభం కోసం సవరణలు జరిగాయి. నరేంద్ర మోడీ కాలంలో జరిగిన 22 సవరణలు సామాజిక న్యాయం దృష్టిలో పెట్టు-కుని చేసినవే. డీకే శివకుమార్ ముస్లిం మైనారిటీ-లకు 4??? అదనపు రిజర్వేషన్ ఇవ్వడానికి రాజ్యాంగాన్ని మార్చేస్తాం అన్నారు. శివకుమార్‌కు రాజ్యాంగం పట్ల ఉన్న గౌరవం ఇదేనా.. మీకోసం మార్చేస్తారా?' అని మండిపడ్డారు. అంబేద్కర్ జయంతి వేడుకలు రేపటి నుంచి 25వ తేదీ వరకూ జరపాలని నిర్ణయం తీసుకున్నాం. అంబేద్కర్ ఆశయాలను గ్రామగ్రామాలకూ తీసుకెళ్ళాలని నిర్ణయించారు. బీజేపీ వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారనే కాంగ్రెస్ దుష్ప్రచారం వల్ల వచ్చిన అనుమానాలు లేకుండా చేయడానికే ఈ వేడుకలు. అంబేద్కర్‌ను ఓడించాలని నెహ్రూ అప్పట్లో ఆదేశించారు. అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ రాజ్యాంగానికి తూట్లు- పొడిచింది. మోడీ దేశ అభువృద్ధి కోసం రాజ్యాంగ సవరణలు చేశారు. పార్టీ అధికారం కోసం ఏనాడూ బీజేపీ రాజ్యాంగ సవరణలు చేయలేదు. మోడీ నాయకత్వంలో దేశ అభివృద్ధి ధ్యేయంగా అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నది బీజేపీ. ఎన్డీఏ ప్రభుత్వ కృషిని గురించి ప్రజలకు తెలిసేలా చేయడం, అంబేద్కర్ స్ఫూర్తి తెలిపేలా చేయడం మా ధ్యేయం' అని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు.

# అమెరికా-చైనా దేశాల మధ్య సుంకాల యుద్ధం



**న్యూఢిల్లీ:** అమెరికా-చైనా దేశాల మధ్య సుంకాల యుద్ధం కొనసాగుతున్నది. ఈ క్రమంలో బంగారం ధరలు పతనమయ్యాయి. తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో 3200 డాలర్లకు చేరింది. ఈ ప్రభావం భారతీయ మార్కెట్లపై సైతం కనిపిస్తున్నది. ముంబయిలో 24 క్యారెట్ల బంగారం శనివారం మధ్యాహ్నం వరకు పది గ్రాములకు రూ.96,600కి చేరగా.. 22 క్యారెట్స్ గోల్డ్ రూ.87,460 వద్ద కొనసాగింది.
శుక్రవారంతో పోలిస్తే బంగారం ధర రూ.2వేల వరకు పెరిగిందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. బంగారం రికార్డు స్థాయి ధర రూ.లక్ష మార్క్‌ని చేరుకునేందుకు కేవలం రూ.4,500 దూరంలో ఉన్నది. ఈ క్రమంలో జవేరి బజార్‌లో రీసైకిల్ చేసిన బంగారం అమ్మకాలు, కొనుగోళ్లు పెరిగాయి. బంగారం ధర రికార్డు స్థాయిలో ఉండడంతో ప్రస్తుతానికి ఆభరణాల కొనుగోళ్లు జరగడం లేదని వ్యాపారులు చెప్పారు. పెళ్లిళ్ల సీజన్ కారణంగా 80శాతం మంది వినియోగదారులు రీసైకిల్ చేసిన బంగారాన్ని అంటే.. పాత ఆభరణాలను కొత్తగా తయారు చేయించుకుంటున్నారని చెప్పారు. పాత బంగారాన్ని అమ్మి దాని స్థానంలో కొత్త ఆభరణాలను కొనుగోలు చేస్తున్నట్లు- చెప్పారు. కస్టమర్లు బంగారు నాణేలు, గతంలో కొనుగోలు చేసిన బంగారాన్ని విక్రయిస్తూ ఆభరణాలుగా మార్చుకుంటున్నారన్నారు. ఇంత ఎక్కువ ధరలు ఉన్నా.. 5శాతం వరకు కొత్త కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. ఇందులో అధిక ఆదాయవర్గం మాత్రమే షాపింగ్ చేస్తున్నట్లుగా కనిపిస్తుందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. వెండితో చేసిన చిన్న వస్తువులను కొనుగోలు చేస్తున్నారని.. ఇందులో బహుమతులుగా ఇచ్చే కాళ్ల పట్టీలు, తేలికపాటిక వస్తువులకు 10శాతం వరకు డిమాండ్ ఉంటుందని చెప్పారు. ప్రస్తుతానికి వినియోగదారులు బంగారం కొనడానికి ముందు కొంచెం ఓపికపట్టాలని.. పెట్టుబడి పెట్టాలనుకుంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా గోల్డ్ ఈటీఎఫ్‌లో పెట్టుబడి పెట్టాలన్నారు. ఎందుకంటే బంగారం ఖరీదైందని.. ప్రస్తుతం దాన్ని భౌతికంగా కాకుండా ప్రణాళికాబద్ధంగా కొనుగోలు చేయాలని చెప్పారు. అమెరికా -చైనా మధ్య పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తత, సుంకాల ఆందోళనల కారణంగా ఇటీ-వల కొద్దిరోజులు ధరలు పతనమయ్యాయి. కానీ, తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధర రికార్డు స్థాయిలో 3200 డాలర్లకు చేరింది. రాబోయే రోజుల్లోనూ పసిడి, వెండి ధరలు సైతం పెరగడం ఖాయమని మార్కెట్ వర్గాలు పేర్కొంటు-న్నారు. అనిశ్చితి వాతావరణంలో భౌతికంగా బంగారం కొనుగోలు చేయకుండా.. సురక్షితమైన పెట్టు-బడుల్లో ఒక-టైన గోల్డ్ ఈటీ-ఎఫ్ ద్వారా పెట్టు-బడులను ఎంచుకోవచ్చని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

## శివాజీ చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

ముంబై: ఛత్రపతి శివాజీ మహారాజ్ గురించి ప్రతీ భారతీయుడికి బోధించాలని, ప్రతీ తల్లి తన బిడ్డకు చెప్పాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ప్రతీ భారతీయుడికి మాతృభూమికి సేవ చేయడం, సుపరిపాలనలో ఆదర్శవంతమైన మరాఠా సామ్రాజ్య స్థాపకుడి గురించి చెప్పాలని కోరారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రి షా మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్‌ని మహారాష్ట్రకే పరిమితం చేయవద్దని, ఆయన నుంచి దేశం, ప్రపంచం ప్రేరణ పొందుతుందని చెప్పారు. రాజమాత జిజియా బాయి యువ శివాజీ మనసులో మంచి విలువలను నింపారు, స్వరాజ్యం, స్వధర్మం, భాషను పునరుద్ధరించడానికి ఆమె ప్రేరణనిచ్చిందని అమిత్ షా అన్నారు. చిన్నతనంలోనే మొత్తం దేశాన్ని ఏకం చేసి విముక్తి చేయాలనే ఆలోచనను ఆమె శివాజీకి ఇచ్చిందని, జిజౌ మా సాహెబ్ కూడా హిందవి స్వరాజ్యాన్ని స్థాపించడానికి శివాజీ మహారాజ్‌కి ప్రేరణగా నిలిచిందని చెప్పారు. భారతదేశంలో ప్రతీ బిడ్డ కూడా ఛత్రపతి చరిత్రను తెలుసుకోవాలని, వారికి తెలియజేయడం మనందరి బాధ్యత అని చెప్పారు. 12ఏళ్ల బాలుడు సింధు నుండి కన్యాకుమారి వరకు కాషాయ జెండాను ఎగురవేస్తానని ప్రమాణం చేశాడు. నేను చాలా మంది వీరుల జీవిత చరిత్రలను చదివాను, కానీ అజేయమైన సంకల్ప శక్తి, గొప్ప వ్యూహం, ఈ వ్యూహాన్ని విజయవంతం చేయడానికి సమాజంలోని ప్రజలందరినీ ఏకం చేయడం ద్వారా, మరాఠాలు అపజయం లేని సైన్యాన్ని నిర్మించారు. వారు మొఘల్ సామ్రాజ్యాన్ని నాశనం చేశారు. వారి పోరాటం ఫలితంగా దేశం రక్షించబడింది, భాష రక్షించబడింది. స్వాతంత్య్రం తర్వాత, మనం ప్రపంచంలోనే ఉన్నతంగా నిలుస్తున్నాం' అని అమిత్ షా అన్నారు. నేడు హిందవి
స్వరాజ్ కోసం బలమైన సంకల్పం ఏర్పడిందని, భారతదేశం స్వాతంత్యం÷-ర వచ్చి 100 ఏళ్లు పూర్తి చేసుకునే సమయానికి ప్రపంచంలోనే తొలిస్థానలో ఉంటామని ఆయన అన్నారు.

## ధాన్యం సేకరణలో అస్పష్ట విధానం !

ధాన్యం కావచ్చు...పండించిన పంటలు ఏవైనా కావచ్చు...ఏటా రైతులకు తిప్పలు తప్పడం లేదు. పాలకులు మాటలే తప్ప క్షేత్రస్థాయిలో పథకాలు అమలు కావడం లేదు. కనీస మద్దతు ధరలు ప్రకటించినా వాటిని అమలు చేయడంలో శ్రద్ధ చూపడం లేదు. తాలు పేరుతో, దడవాయి పేరుతో దోచేస్తున్నారు. పంటలకు సకాలంలో రుణాలు అందడం లేదు. బ్యాంకులు కూడా పైకి చెప్పినంతగా ఉదారంగా ఉండడం లేదు. పంటరుణాలను ప్రైవేట్ వ్యక్తుల నుంచే తెచ్చుకోవాల్సి వస్తోంది. దళారులు కొన్న తరవాతే ప్రభుత్వం అధికారులు రంగప్రవేశం చేస్తారు. పంటల కోసం తెచ్చిన పెట్టుబడి అప్పులు తీర్చే తొందరలో ధాన్యాన్ని, పంటలను వచ్చిన రేటుకు, అంటే దళారుల రేటుకు అమ్ముకోక తప్పడం లేదు. ఇదంతా క్షేత్రస్తాయిలో అధికారులకు తెలుసు. మార్కెట్ కమిటీలు పెట్టినా,సహకారసంఘాలు ఉన్నా.. ధాన్యం చేతికొచ్చే సమయానికి తిప్పలు పడక తప్పడం లేదు. పంట ఏదైనా ఇదే దుస్థితి ఉంది. కొనుగోళ్ల విషయంలో ఆందోళనలు రాజకీయపార్టీల బలాబలాల ప్రదర్శనగా ఉందే తప్ప రైతులను ఆదుకునే విధానంలా ఉండడం లేదు. ఇందులో అన్ని పార్టీలు ఎవరికివారు తమవంతు రాజకీయ లాభం కోరే పాత్ర పోషిస్తూ రక్తి కట్టిస్తున్నారు. పాలకులు తమ రాజకీయ విన్యాసాలకు ప్రజలను ఎలా మోసం చేస్తారో స్పష్టంగా కనిపిస్తోంది. జానికి కేంద్రం తీరు కూడా ఏ మాత్రం సరిగా లేదు.ఇందులో ఎలాంటి అనుమానాలు లేవు. ధాన్యం కొనుగేళ్లే కాదు..అనేకానేక విషయాల్లో కేంద్రాన్ని నిలదీయాల్సిందే. రైతులు బతకడానికే కష్టపడుతున్నారు. మనలను బతికించడానికి వారు వ్యవసాయం చేస్తున్నారు. కేంద్రం పెట్రో, డీజిల్,గ్యాస్ ధరలతో మొత్తంగా అన్ని సరకుల ధరలు పెంచుతూ పోతున్నది. సామాన్యులు నానాయాతనలు పడుతున్నా పట్టించుకోవడం లేదు. అలాగే ధాన్యం ధరలను ఏటేటా పెంచడం లేదు. ఎవరికి వారు ధాన్యం ధరలు ని÷-ణయించుకునే పరిస్థితి లేదు.నిజానికి వ్యవసాయంపై జాతీయ విధానం రావాల్సిందే. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శక విధానం రావాలి. వ్యవసాయ దిగుమతలను తగ్గించుకుని..ఎగుమతులను పెంచుకోవాలి. వంటనూనెలను దిగుమతిని ఆపేయాలి. దేశీయంగా పంటలకు ప్రోత్సాహం ఇవ్వాల్సిందే. ఇవన్నీ చర్చించడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అన్ని రాష్ట్రాల్లో ఏకాభిప్రాయం రావాలి. కానీ అలా జగరడం లేదు. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారు చూసుకుంటున్నారే తప్ప ప్రజలను పట్టించుకోవడం లేదు. రైతుల పట్ల ఎలాంటి వివక్ష చూపడం లేదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న ధాన్యం కొనుగోళ్లు మాత్రం సజావుగా సాడం లేదు. ఇప్పుడు వడగళ్ల వానల కాలం. ధాన్యం కల్లాల్లోకి చేరకముందే తడిసి ముద్దవుతోంది. కల్లాల్లో కొన్నిసార్లు తడిసి కొట్టుకు పోతోంది. ఇదంతా దైవాధీనంగా రైతుల పరిస్థితి ఉంది. మార్కెట్లో పత్తి, మిర్చి, వరి తదితర పంటలు వచ్చినా..ట్రాక్టర్లు బారులు తీరినా సక్రమంగా అమ్ముకుని ఇంటికి చేరుతామన్న ధైర్యం రైతుల్లో ఏ రోజూ కనిపించడం లేదు. పంజాబ్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసిన తరహాలోనే దేశమంతటా ఒకే విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్రం తెలిపినా ..ఏటేటా మాత్రం ధాన్యం అమ్మకాల వ్యయహారం ప్రహసనంగా మారుతోంది.



# నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

### మద్దతు ధరలను పట్టించుకోని అధికారులు

### దళారులకు తక్కువ ధరలకే అమ్ముకోవాల్సిన దుస్థితి

**కాకినాడ:** ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు నత్తనడకన సాగుతు న్నాయి. జిల్లా వ్యాప్తంగా 20 రోజుల నుంచి వరి కోతలు సాగుతున్నాయి. ఇప్పటివరకు 12 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి.43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. కాని ఇందులో వంద మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా నేటికీ కొనుగోలు చేయలేదు. ధాన్యం సేకరణకు జిల్లాలో 225 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు- చేసినా రైతులకు ఉపయోగపడడం లేదు. ఈ నెల మూడు నుంచి కొనుగోళ్లను ప్రారంభించామని అధికారులు ప్రకటించినప్పటికీ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించకపోవడంతో కొనుగోళ్లు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు విధించడం, కొనుగోలు కేంద్రాలకు సిబ్బంది రాకపోవడంతో అన్నదాతలకు దిక్కుతోచడం లేదు. వాతావరణ మార్పులు, ధాన్యం నిల్వ చేసుకునే వెసులుబాటు-లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటి వరకూ కేవలం 98 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో కాకినాడ జిల్లాలో 1.62 లక్షల ఎకరాల్లో 1.45 లక్షల మంది రైతులు వరిని పండించారు. 5.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, తేమ శాతం తదితర నిబంధనల వల్ల రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. మరోపక్క సిబ్బంది కూడా కొనుగోలు కేంద్రాలకు పూర్తిస్థాయిలో రావడం లేదు. గత ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వేతనాలు కూడా ఇవ్వకపోవడంతో చాలామంది విధులకు గైర్హాజరవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొన్నిచోట్ల సిబ్బంది హాజరవుతున్నప్పటికీ కొనుగోళ్లు మాత్రం నత్తనడకనే సాగుతున్నాయి. ఇప్పటి వరకు రెండు కేంద్రాల నుంచి 98 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం కేంద్రాల పనితీరుకు నిదర్శనం.
ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సరిగా పనిచేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం సాధారణ రకం క్వింటాలు రూ.2,300, ఎ-గ్రేడ్ రకానికి రూ.2,320 మద్దతు ధరగా ప్రకటించింది. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం 75 కిలోలకు సాధారణ రకానికి రూ.1725, ఎ-గ్రేడ్ రకానికి రూ.1740 రావాల్సి ఉంది. కానీ దళారులు రూ.1,400 మించి కొనుగోలు చేయడం లేదు. కోతలు కోసిన తర్వాత తేమ శాతం ఎక్కువగా చూపించి రూ.1000కే అడుగుతున్నారని పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని పలువురు రైతులు చెబుతున్నారు. బస్తాపై రూ.340 నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటి-కై-నా
ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను అందుబాటు-లోకి తీసుకొచ్చి నిబంధనలను సడలించి మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేసేలా
చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఇంకా సేకరించడం లేదని రైతులు వాపోతున్నారు. సాధారణ రకం మద్దతు ధర ప్రకారం (75 కిలోలు) రూ.1,740 అని చెబుతున్నారు. ప్రయివేటు వ్యాపారులకు రూ.1,400కు అమ్ముకోవాల్సి వచ్చింది. ఒక్కో బస్తాపై రూ.340 నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనలు సడలించి మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవాలి.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయివేటు- వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. తేమ శాతం పేరుతో వారు తక్కువ ధర చెల్లిస్తున్నారు.

## అన్నదాతను దెబ్బతీస్తున్న అకాల వర్షాలు

**నిజామాబాద్:** తీవ్రమైన ఎండలు, ఈదురుగాలుల బీభత్సం, అకాల వర్షాలతో ఆదరబాదరగా పంటలను అమ్మేసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఏర్పడింది. ముందుచూపుతో పంట చేతికొచ్చే సమయానికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉండదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించినా..ఎలాంటి ప్రయోజ నం ఉండదని రైతులు అంటున్నారు. అన్నదాతల అవసరాలు, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దళారులు అందినకాడికి దండుకోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా అధికారులకు ముందే తెలిసినా.. ముందుచూపు లేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. పంట వేసిన తర్వాత సుమారు 3, 4 నెలల పాటు సమయం ఉంటుంది. కాని ఏటా పంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతూనే ఉంది. ఈ యేడు మొక్కజొన్న పంట కొనుగోళ్లపై సందిగ్ధ పరిస్థితులే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం వరికి ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని చెప్పడంతో జిల్లాల్లో భారీగా ఆరుతడి పంటలనే ఎక్కువగా సాగు చేశారు. ఇందులో ప్రధానంగా జొన్న, మొక్క జొన్న, శనగ, తదితర పంటలు సాగయ్యాయి. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రతీసారి కొనుగోళ్ల పక్రియ ఆలస్యం కావడంతో సగం పంట దళారుల పాలవుతూనే ఉంది. ఈసారి కూడా అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సగం పంట అమ్మిన తర్వాత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉండదంటున్నారు. కొన్ని జిల్లాల్లో మార్క్‌ఫెడ్ అధికారులు సగం పంటలను మాత్రమే
కొనుగోలు చేసి టార్గెట్ పూర్తయ్యిందని ప్రకటించుకున్నారు. ఇలాంటి పరిస్థితులకు అవకాశం ఇవ్వకుండా ముందుచూపుతో వ్యవహరిస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు కొనుగోలు పక్రియను మొదలు పెట్టకపోవడంతో మద్దతు ధర కొందరికే దక్కే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పంట నూర్పిడి చేసిన రైతులు.. బయట మార్కెట్‌లో దళారులను ఆశ్రయించి దిగుబడులను అమ్మేసుకుంటున్నారు. దళారులు ఇంటికే వచ్చి రైతులను మభ్యపెడుతూ తక్కువ ధరకే పంటను కొనుగోలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతేడాది రైతులు ఆందోళనలు, ధర్నా లు, నిరసనలు చేపట్టడంతోనే దిగొచ్చిన ప్రభుత్వం.. చివరి సమయంలో కొనుగోళ్లు చేపట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షాలకు పంట దిగుబడులు తడవడంతో మద్దతుధరలో కోతలు విధించారు. చేతికొచ్చిన పంటను చేనులోనే కుప్పలుగా పోసి అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తుందని చెబుతున్నారు. వాతావరణం సహకరించకుంటే దిగుబడులు చేతికొచ్చినా.. కష్టంగానే ఉంటుందని వాపోతున్నారు.

# కశ్మీర్‌కు తొలి వందేభారత్ రైలు

**19న ప్రారంభించనున్న మోదీ**

**38 సొరంగాలు.. 927 వంతెనలు దాటుతూ ప్రయాణం**



జమ్మూ: కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వందేభారత్ రైలు సేవలు కశ్మీర్‌లోయలో తొలిసారి అందుబాటులోకి రానున్నాయి. ఈనెల 19న ఈ రైలు కట్రా నుంచి కశ్మీర్‌కు పరుగులు తీయనుంది. ఉధంపుర్-శ్రీనగర్-బారాముల్లా మధ్య 272 కి.మీ. మేర ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన రైల్వే అనుసంధాన ప్రాజెక్టు పూర్తయిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభించనున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెనను ఆయన సందర్శించి, ప్రారంభిస్తారని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ సోమవారం వెల్లడించారు. జమ్మూ రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నందున జమ్మూ-కట్రా-శ్రీనగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ తొలుత కట్రా నుంచి ప్రారంభం కానుంది. కశ్మీర్‌ను రైళ్లతో అనుసంధానించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు 1997లోనే ప్రారంభమయింది. ఈ ప్రాజెక్టులో 38 సొరంగాలు ఉన్నాయి. వీటి మొత్తం పొడవు 119 కి.మీ. కాగా 12.75 కి.మీ. ఉండే టీ-49.. దేశంలోనే అత్యంత పొడవైన రవాణా సొరంగం. ఈ ప్రాజెక్టులో 927 వంతెనలు ఉన్నాయి. వీటిలో చినాబ్ నదిపై నిర్మించిన వంతెన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైంది. ఈ మార్గంలో వంతెనలన్నింటి పొడవు కలిపి 13 కి.మీ.

## విద్యావ్యవస్థను వ్యాపారంగా మార్చేసిన భాజపా

**కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ విమర్శ**



దిల్లీ: దేశ విద్యావిధానంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తూర్పారబట్టారు. సెంట్రలైజేషన్, కమర్షియలైజేషన్, కమ్యూనలైజేషన్ అనే మూడు 'సీ'లు దేశ విద్యా విధానాన్ని శాసిస్తున్నాయని ఓ పత్రికకు రాసిన వ్యాసంలో ఆవేదన వ్యక్తం చేశారు. 'భాజపా గత పదేళ్ల పాలనను పరిశీలిస్తే విద్యను వ్యాపారం చేయడం, ఈ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను పెంచడం, పాఠ్యపుస్తకాలు, కరిక్యులమ్, విద్యాసంస్థల్లో మతాన్ని జొప్పించడమే లక్ష్యాలుగా వ్యవహరించింది. ఎటువంటి అడ్డూ అదుపూ లేని కేంద్రీకరణనే వారు కోరుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖ మంత్రులు ఉండే సెంట్రల్ ఎడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (సీఏబీఈ) 2019 నుంచి సమావేశం కాలేదు. జాతీయ విద్యా విధానం 2020 అమలుపై రాష్ట్ర ప్రభుత్వాలతో కనీసం ఒక్కసారైనా చర్చలు జరపలేదు. విద్య కేంద్రరాష్ట్రాల ఉమ్మడి అంశమైనా కేంద్ర ప్రభుత్వానికి లెక్కలేదు" అని విమర్శలు గుప్పించారు. "విద్యావ్యవస్థ ద్వారా విద్వేషాన్ని పెంచడమనే ఆరెస్సెస్, భాజపాల సుదీర్ఘ కాంక్షను ఇప్పుడు నెరవేర్చుకుంటున్నారు. మహాత్మా గాంధీ హత్యోదంతాన్ని, మొగలుల పాలనా విషయాలను పుస్తకాల నుంచి తొలగించారు. తగిన నైపుణ్యాలు లేకపోయినా ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీల్లో వారి సిద్ధాంతాలకు అనుగుణంగా ఉన్నవారికే కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారు' అని ఆక్షేపించారు. విద్యావ్యవస్థపై సాగుతున్న ఈ మారణహోమం వెంటనే ఆగిపోవాలని సోనియా ఆకాంక్షించారు.

## హారతి ఇస్తుండగా మంటలు.. గాయపడిన గిరిజా వ్యాస్



జైపుర్: కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, కేంద్ర మాజీ మంత్రి గిరిజా వ్యాస్(79) అగ్నిప్రమాదంలో గాయపడ్డారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో తన నివాసంలో సోమవారం పూజ చేస్తున్న సమయంలో హారతి ఇస్తుండగా.. ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు.. మెరుగైన వైద్యం కోసం ఆమెను అహ్మదాబాద్‌కు తరలించాలని సూచించారు. ఇంట్లో ఆమె హారతి ఇస్తుండగా దీపం నుంచి మంటలు ఆమె దుపట్టాకు అంటుకోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు గిరిజా వ్యాస్ సోదరుడు గోపాల్ శర్మ తెలిపారు. గిరిజా వ్యాస్ గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలందించారు. జాతీయ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్‌గానూ పనిచేశారు.

# మీడియా ముందుకు వ్యోమగాములు

## ఇప్పుడు బాగానే ఉంది : సునీతా విలియమ్స్



భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌లు దాదాపు 9 నెలల అనంతరం మార్చి 19న వారు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ క్యాప్సుల్‌లో భూమిపై అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. వీరితో పాటు మరో ఇద్దరు వ్యోమగాములు సైతం వాహకనౌకలో వచ్చారు. దీంతో వీరందరినీ నాసా సిబ్బంది. హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలించారు. 12 రోజుల అనంతరం తొలిసారి వారు బాహ్య ప్రపంచం ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా నాసా నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సునీతా, బుచ్ విల్మోర్, నిక్ హేగ్ మాట్లాడారు. తనకు ఇప్పుడు బాగానే ఉందని సునీతా పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. అవకాశం వస్తే మళ్లీ స్టార్ లైనర్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్తామని, అది చాలా సామర్థ్యం గల వాహకనౌక అని సునీతా అన్నారు. అయితే అందులో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయని వాటిని సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మరో వ్యోమగామి విల్మోర్ మాట్లాడుతూ.. బోయింగ్, నాసా కట్టుబడి ఉన్నందున స్టార్‌లైనర్‌లో ఏర్పడ్డ సమస్యలను పరిష్కస్తామని పేర్కొన్నారు.

తమ మిషన్ విజయవంతం కావడానికి సహాయం చేసిన నాసా బృందాలకు సునీతా ధన్యవాదాలు తెలిపారు. గతంలో తీసుకున్న శిక్షణ మమ్మల్ని ఐఎస్ఎస్‌కు తీసుకువెళ్లేలా సిద్ధం చేసిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మిషన్ కంట్రోల్ బృందాలు తాము తిరిగి భూమిపైకి రావడంలో, పునరావాసం, కొత్త సవాళ్లకు సిద్ధకావడానికి ఎంతో సహాయం చేశాయన్నారు. తాను భూమిపైకి వచ్చాక ఇప్పటికే మూడు మైళ్లు పరుగెత్తానని తెలిపారు. తాను మళ్లీ సాధరణంగా స్థితికి రావడానికి సహాయం చేసిన శిక్షకులకు సునీతా ధన్యవాదాలు తెలిపారు. ఐఎస్ఎస్‌లో ఉన్న సమయంలో తమ టాస్క్‌ల్లో భాగంగా ఎన్నో సైన్స్ ప్రయోగాలు చేపట్టామని, శిక్షణ పొందామని పేర్కొన్నారు.

ఇక ఐఎస్ఎస్‌లో ఉన్నప్పుడు తన ఆరోగ్యం గురించి చాలా మంది ఆందోళనకు గురైన విషయం తనకు తెలునన్నారు. అయితే తాము ఒక పెద్ద టీమ్ ప్రయత్నంలో భాగమై ఉన్నట్లు తెలిపారు. అంతరిక్షం నుంచి భూమిపైకి వచ్చాక శరీరంలో కొన్ని మార్పులు ఉంటాయని, అందుకు తగ్గట్లు కొన్ని సర్దుబాట్లు అవసరమన్నారు. అయితే తాము కోలుకోవడంలో సహాయ బృందాలు ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాము భూమిపై దిగిన దగ్గర నుంచి బలాన్ని తిరిగి పొందడానికి సహాయ బృందాలు ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు.

విల్మోర్ మాట్లాడుతూ.. మానవ అంతరిక్ష యానం దేశాలను ఒక్కతాటిపైకి తెస్తుందని అన్నారు. ఇక స్టార్‌లైనర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యలు, హీలియం లీకేజీల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తున్న నాసా, బోయింగ్ టీమ్స్ నిబద్ధతను ఆయన కొనియాడారు. తమకు నాసాపై ఎంతో నమ్మకముందన్నారు. తాము సురక్షితంగా భూమిపైకి చేరడంలో నాసా నిబద్ధతకు సంబంధించి ఇదొక మైలురాయిగా వారు అభివర్ణించారు.

గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ప్రణాళిక ప్రకారం వీరు 8 రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వారు అక్కడే చిక్కుకుపోయారు. ఇక వ్యోమగాములు లేకుండానే స్టార్‌లైనర్ కొన్నిరోజులకు భూమిపైకి తిరిగొచ్చింది. నాటినుంచి సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌లోనే ఉండిపోయారు. అనేక ప్రయత్నాల అనంతరం స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్‌లో వారు ఐఎస్ఎస్ నుంచి సురక్షితంగా భూమిపైకి చేరుకున్నారు.

## దాడిచేస్తే అమెరికాను తీవ్రంగా దెబ్బతీస్తాం

**ఇరాన్ సుప్రీంనేత ఖమేనీ హెచ్చరిక .. క్షిపణుల్ని సిద్ధంచేస్తున్న టెహ్రాన్**



దుబాయ్: ఇరాన్, అమెరికా మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. టెహ్రాన్ తన అణుకార్యక్రమంపై ఓ ఒప్పందం కుదుర్చుకోవాలని.. అందుకు చర్చలు జరపాలని ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే నేరుగా అగ్రరాజ్యంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా లేమని ఇరాన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల నేతల మధ్య మాటలు తూటాలు పేలుతున్నాయి. ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. అణు కార్యక్రమంపై చర్చలకు ఇరాన్ అంగీకరించకపోతే ఆ దేశంపై బాంబుల వర్షం కురిపిస్తామని హెచ్చరించారు. దీనిపై ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ సోమవారం స్పందించారు. తమ దేశంపై దాడికి అమెరికా ప్రయత్నిస్తే ఎదురుదాడి తప్పదని స్పష్టం చేశారు. అగ్రరాజ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తామని హెచ్చరించారు. "మాపై ఇజ్రాయెల్, అమెరికాలకు ద్వేషం ఎప్పుడూ ఉంది. మాపై దాడి చేస్తామని బెదిరిస్తారు. అయితే వారు చేస్తారని అనుకోవడం లేదు. ఒక వేళ అలాంటి దుస్సాహసానికి ఒడిగడితే.. మావైపు నుంచి తీవ్రస్థాయిలో స్పందన ఉంటుంది. వారిని తీవ్రంగా దెబ్బతీస్తాం. అలా కాకుండా గతంలోలా మా దేశం లోపల చిచ్చు రేపాలని ప్రయత్నిస్తే.. ఆ విషయాన్ని ఇరాన్ ప్రజలే చూసుకుంటారు" అని ఖమేనీ తెలిపారు. మరోవైపు ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో భూగర్భ ప్రయోగ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో క్షిపణులను లాంచ్‌ప్యాడ్‌లపై ఇరాన్ సిద్ధంగా పెట్టినట్లు టెహ్రాన్ టైమ్స్ కథనం వెల్లడించింది. వైమానిక దాడుల కోసం వీటిని ప్రయోగించే అవకాశాలున్నట్లు తెలిపింది.

## ప్రార్థనల్లోనే 700 మంది కడతేరిపోయారు

**మయన్మార్‌లో వెలుగులోకి మరిన్ని ఘటనలు**

**భూకంప మృతులు 2,000 పైనే!**



మాండలే, బ్యాంకాక్: మయన్మార్‌లో ఇటీవల పెను భూకంపం సంభవించిన సమయంలో వివిధ మసీదుల్లో ప్రార్థనల్లో ఉన్నవారిలో దాదాపు 700 మంది ప్రాణాలు కోల్పోయారని బయట పడింది. 'మయన్మార్ ముస్లిం సంస్థ' దీనిని ప్రకటించింది. భూకంప విలయానికి ఇంతవరకు 2,000 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, మరో 3,900 మంది గాయపడ్డారని అధికార వర్గాలు తెలిపాయి. దాదాపు 60 మసీదులు కూలిపోవడమో, దెబ్బతినడమో జరిగిందని, వీటిలో చాలావరకు పురాతనమైనవని ముస్లిం సంఘాల ప్రతినిధి తున్ క్యీ తెలిపారు. కుప్పకూలిన ఓ మఠంలో 200 మంది బౌద్ధ సన్యాసులు నలిగిపోవడం, పూర్వపాఠశాల తరగతి గదిలో 50 మంది చిన్నారులు విగతజీవులు కావడం వంటివి వెలుగుచూశాయి.

**పరీక్ష రాస్తున్నవారి ఆచూకీ గల్లంతు**

మాండలేలో మతపరమైన పరీక్షను రాస్తున్న 270 మందిలో 50 మంది ప్రాణాలు కోల్పోగా 70 మంది సురక్షితంగా బయటపడ్డారు. మిగిలినవారి ఆచూకీ గల్లంతయింది. మొత్తంమీద దాదాపు 3,400 మంది గాయపడ్డారని, ఇంకో 300 మంది ఆచూకీ గల్లంతైందని మయన్మార్ ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. ప్రభుత్వ అంచనాల కంటే ప్రాణనష్టం అనేక రెట్లు ఎక్కువే ఉంటుందని క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి.

**ఏడు మృతదేహాలను వెలికితీసిన ఎన్డీఆర్ఎఫ్**

దిల్లీ: సహాయక చర్యల నిమిత్తం మయన్మార్‌లోని మాండలే ప్రాంతానికి భారత్ తరఫున వెళ్లిన 'జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం' (ఎన్డీఆర్ఎఫ్) బలగాలు 13 భవనాల్లో గాలింపు చేపట్టి.. ఏడు మృతదేహాలను వెలికితీశాయి. ప్లాస్మా కట్టర్లు, జాగిలాల సాయంతో ఈ బలగాలు విస్తృతంగా గాలిస్తున్నాయి.

## నోబెల్‌శాంతి పురస్కారానికి ఇమ్రాన్‌ఖాన్ పేరు



ఇస్లామాబాద్: మానవహక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణకు పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్(72) చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఆయన పేరును నోబెల్ శాంతి పురస్కారానికి నామినేట్ చేసినట్లు న్యాయవాదుల సంస్థ ఒకటి వెల్లడించింది. నార్వే రాజకీయపార్టీ పార్టియేట్ సెంట్రమ్‌కు అనుబంధంగా గతేడాది డిసెంబరులో న్యాయవాదుల సంస్థ పాకిస్థాన్ వరల్డ్ అలయన్స్ (పీడబ్ల్యూఏ) పేరిట ఏర్పాటైంది. "పాకిస్థాన్‌లో మానవహక్కులు, ప్రజాస్వామ్యం కోసం ఇమ్రాన్ ఖాన్ చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఆయన పేరును నోబెల్ శాంతి పురస్కారానికి తమ పార్టీ తరఫున నామినేట్ చేస్తున్నాం" అని పార్టియేట్ సెంట్రమ్ 'ఎక్స్'లో వెల్లడించింది.

## ఇద్దరికి చెరో మిలియన్ డాలర్లు

**విస్కాన్సిన్ సుప్రీంకోర్టు ఓటర్లకు ఇచ్చిన మస్క్**


**ఎన్నికల్లో గెలుపు కోసం తీవ్ర ప్రయత్నం**



గ్రీన్ బే: విస్కాన్సిన్ సుప్రీంకోర్టు ఎన్నికల ఓటర్లిద్దరికి చెరో మిలియన్ డాలర్లను ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అందజేశారు. వారిని తమ రాజకీయ గ్రూపునకు అధికార ప్రతినిధులుగా ప్రకటించారు. డొనాల్డ్ ట్రంప్ ఎజెండాను అమలు చేయడానికి, భవిష్యత్తు తరాల బాగుకు ఈ ఎన్నికల్లో విజయం సాధించడం కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కేవలం ఈ ఎన్నికల కోసం మస్క్.. 20 మిలియన్ డాలర్లను ఖర్చు చేస్తున్నారు. ఇలా డబ్బులు ఇవ్వడాన్ని అడ్డుకోవాలని డెమోక్రాట్లు వినిపించిన వాదనలను కోర్టులు తోసిపుచ్చాయి. ప్రస్తుతం సుప్రీం కోర్టులో 4-3తో లిబరల్ జడ్జీల ఆధిపత్యం కొనసాగుతోంది. విస్కాన్సిన్‌లోని జిల్లాల పునర్వ్యవస్థీకరణను హైకోర్టు చేపడుతోంది. దీనివల్ల డెమోక్రాట్లకు రెండు కాంగ్రెస్ సీట్లు అదనంగా గెలుచుకోవడానికి అవకాశముంటుంది. ఇప్పటికే అమెరికా చట్టసభల్లో ట్రంప్ ప్రభుత్వానికి అత్తెసరు మెజారిటీ ఉంది.

అదే జరిగితే బిల్లులను ఆమోదింపజేసుకోవడం రిపబ్లికన్లకు కష్టమవుతుంది. 'విస్కాన్సిన్ సుప్రీంకోర్టు జిల్లాల పునర్వ్యవస్థీకరణను ఆమోదిస్తే రెండు సీట్లు కోల్పోయి రిపబ్లికన్లకు ఇబ్బంది కలుగుతుంది. అప్పుడు చట్టసభల్లో డెమోక్రాట్లు ముఖ్యమైన సంస్కరణలను అడ్డుకుంటారు' అని మస్క్ పేర్కొన్నారు.

## వక్ఫ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధం



దిల్లీ: కొన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు వక్ఫ్ బిల్లులోని కొన్ని నిబంధనలకు వ్యతిరేకంగా సమాజంలో అశాంతిని సృష్టించేందుకు, ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. అయితే, సవరించిన వక్ఫ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సర్వసన్నద్ధంగా ఉందని వెల్లడించారు. పార్లమెంటు సమావేశమయ్యాక వివిధ పక్షాలతో సంప్రదించి బిల్లును ప్రవేశపెట్టే రోజును, సమయాన్ని ఖరారు చేస్తామన్నారు. ఈ బిల్లు చట్టంగా మారితే ముస్లింల మసీదులు, సమాధుల స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందనే దుష్ప్రచారం జరుగుతోందని మీడియా సమావేశంలో మంత్రి పేర్కొన్నారు. బ్రిటిష్ పాలకుల హయాంలో తీసుకువచ్చిన వక్ఫ్ చట్టాన్ని క్రమబద్ధీకరించడం కోసమే బిల్లును తెస్తున్నామని వివరించారు. పౌరసత్వ సవరణ చట్టంపైనా ఇలాంటి ఆరోపణలే చేశారని మంత్రి కిరణ్ రిజిజు గుర్తు చేశారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ఒక్క ముస్లిం పౌరసత్వమైనా రద్దు అయ్యిందా అని మంత్రి ప్రశ్నించారు. ముస్లింల ప్రయోజనం కోసమే బిల్లును తెస్తున్నామని వెల్లడించారు. వారాంతపు, రంజాన్ పండగ సెలవు అనంతరం మంగళవారం పార్లమెంటు ఉభయ సభలు భేటీ కానున్నాయి. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 4వ తేదీతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో వక్ఫ్ బిల్లును తొలుత లోక్‌సభలో బుధవారం ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

ఉత్తేజిత దినపత్రిక

# ఇంటర్ ఫలితాలలో సత్తా చాటిన సి.బెళగల్ కళాశాలలు

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ ఏప్రిల్ 12**

సి.బెళగల్ మండలంలోని స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల, ఏపీ మోడల్ కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించారని ఆయా కళాశాల ప్రిన్సిపాల్ బలరాముడు, వంశీ మోహన్ రావు, జ్యోతి తెలిపారు.

**గురుకుల కళాశాల ఫలితాల వివరాలు:**

సి.బెళగల్ మండలంలోని స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 97.06% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని,వీరిలో సైన్స్ విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించరని, సైన్స్ విభాగంలో మల్లెపోగు ప్రదీప్ 955, గుండి పోగుల ప్రదీప్ 931సంధ్య పోగు దిలీప్ కుమార్ 930 మార్కులు సాధించారని,గణితం విభాగంలో 93.94% ఉత్తీర్ణత సాధించరీని వీరిలో ఉప్పరి అభిరామ్ 922, ఆవుల జాన్ వెస్లీ 915, అంజి నాయక్ 887 మార్కులు సాధించారని , అలాగే ప్రథమ సంవత్సరంలో 77.94 % ఉత్తీర్ణత సాధించారని వీరిలో సైన్స్ విభాగంలో నత్తి రమణ 411/400, ఈలాడి షాలెమ్ 396/440, గుండి పోగుల సురేష్ 395/440 మార్కులు సాధించారని,గణితం విభాగంలో సంధ్య పోగు జస్వంత్ కుమార్ 432/470, షావాల సురేష్ 422/470, సుగాలి మహేష్ నాయక్ 408/470 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు.



**ఆదర్శ కళాశాలలో ఫలితాల వివరాలు:**

సి.బెళగల్ మండలంలోని స్థానిక ఆదర్శ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 60 %మంది విద్యార్థులు, ప్రథమ సంవత్సరంలో 61% మంది విద్యార్థినీ,విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ వంశీ మోహన్ రావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం సైన్స్ విభాగంలో విజయలక్ష్మి 964, నస్రిన్ 928, మణికంఠ 883 మార్కులు సాధించారని, గణిత విభాగంలో బుడ్డ ఈశ్వరుడు 629, జి.శివ 531 మార్కులు సాధించారని, సీ.ఈ.సీ విభాగంలో కృష్ణవేణి 945, మహేశ్వరి 827, శిరీష 771 మార్కులు సాధించారని, అలాగే ప్రథమ సంవత్సరం గణితం విభాగంలో రోహిణి 459, సరస్వతి 456, సరళ 442 మార్కులు సాధించారని, సైన్స్ విభాగంలో ఎస్తేరు రాణి 433, సువర్ణ 412, అనిత 408, సీఈసీ విభాగంలో దుర్గ భవాని 430, జ్యోత్న 421, పుష్పావతి 416 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ వంశీ మోహన్ రావు తెలిపారు.

**కస్తూర్బా గాంధీ కళాశాల ఫలితాలు:**

సి.బెళగల్ మండలంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరం సైన్స్ విభాగంలో 90% విద్యార్థినిలు ఉత్తీర్ణత సాధించాలని, వీరిలో టి.భారతి 910, అరుణ 909, కమల 873 మార్కులు సాధించారని, అలాగే ప్రథమ సంవత్సరంలో 68% విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారని, వీరిలో టి.భారతి378/440, మల్లేశ్వరి 367/440, రోజా రాణి 349/440 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు.

**ఆదర్శ కళాశాలలో సైన్స్ విభాగంలో విజయలక్ష్మి 964/00**

**కస్తూర్బా గాంధీ కళాశాలలో టి. భారతి 910/1000**

# నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్న పవన్

**- పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం**

**- గ్రామ సభల ద్వారా పంచాయతీల అభివృద్ధి**

**- జనసేన సీనియర్ నాయకుడు మండ్లెం రామిరెడ్డి**

**నందికొట్కూర్ ఉత్తేజిత ప్రతినిధి ఏప్రిల్ 12-:**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన ట్రస్ట్ ద్వారా కొణిదెల గ్రామానికి 50 లక్షలు నిధులు మంజూరు చేశారని, వరద పీడిత ప్రాంతాలైన భాను ముక్కల ,వేంపేట గ్రామాలకు రెండు లక్షల అందించి నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని నందికొట్కూరు జనసేన సీనియర్ నాయకుడు మండ్లెం రామిరెడ్డి అన్నారు . శనివారం మండల పరిధిలోని తర్తూరు గ్రామంలో జనసేన నాయకులు,సూర్యుడు ,అశోక్ ,గని ,సంజీవ్ సుబ్బన్నల ఆధ్వర్యంలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన సీనియర్ నాయకుడు మండ్లెం రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ విలువలతో కూడిన సేవా రాజకీయాలలో రాష్ట్రవ్యాప్తంగా 100 కోట్లకు పైగా సాయం అందించారని నందికొట్కూరు నియోజకవర్గంలో తన ఇంటిపేరు కొణిదెల గ్రామం ఉన్నందున కొణిదెల గ్రామానికి తమ సొంత నిధులు 50 లక్షల గ్రామ అభివృద్ధికి పంచాయతీకి , అంతేకాక పాములపాడు మండలంలోని వరద పీడిత గ్రామాలైనటువంటి వేంపెంట , భానుముక్కల గ్రామాలకు రెండు లక్షల చొప్పున ఇచ్చారని నందికొట్కూరు నియోజకవర్గం లో



కౌలు రైతులను తానే స్వయంగా పరామర్శించి కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున 32 కుటుంబాలకు 32 లక్షలు ఇచ్చి దాదాపు నందికొట్కూరు నియోజకవర్గం లో కోటి రూపాయల వరకు సాయం అందించారని వారు తెలిపారు, అనంతరం జనసేన నాయకులు మద్దిలేటి మాట్లాడుతూ విలువలతో కూడిన సేవా రాజకీయాలు పవన్ కళ్యాణ్ గారికి సాధ్యమన్నారు, ఆంధ్ర రాష్ట్ర రాజకీయాల్లో జనసేన పార్టీ, పవన్ కళ్యాణ్ మార్క్ లేకుండా ఉండవన్నారు, సంపత్ మాట్లాడుతూ ఒక వైపు మార్క్ శంకర్ తన కుమారుడు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మరోవైపు ప్రజలకు ఇచ్చిన మాట కోసం మన్యం గ్రామాలను పర్యటించి 5 లక్షల సాయం అందించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని ,కుటుంబం కంటే ప్రజలే ముఖ్యమని ప్రజల పట్ల చిత్తశుద్ధి, రాష్ట్రం పట్ల బాధ్యత ఉన్న ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ గారు అన్నారు.బాలరాజు మాట్లాడుతూ ఒకే రోజు 3325 గ్రామపంచాయతీలో గ్రామసభలు నిర్వహించి పనులు చేపట్టారని పవన్ కళ్యాణ్ గారు మాటల మనిషి కాదు చేతలమనిషని పని చేసి చూపించే నాయకుడని అన్నారు.పుష్ప రాజ్ మాట్లాడుతూ 21 ఎమ్మెల్యేలు 100% స్ట్రైక్ రేటు ఒక పవన్ కళ్యాణ్ గారికే సొంతమన్నారు, కుమార్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పదవికే వన్నెతెచ్చిన ప్రజా నేత అన్నారు, కుమార్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానంలో భవిష్యత్ తరాలకు కాలుష్యం లేని ప్రకృతి సంపధ అందించాలన్నదే పవన్ కళ్యాణ్ ఆకాంక్ష అన్నారు, చిరంజీవి అభిమాని నాగరాజు మాట్లాడుతూ స్వయంకృషి వాటి మూలాలు మరువని నాయకుడు శ్రీ పవన్ కళ్యాణ్ అన్నారు .సతీష్ ,రమణ, మద్దిలేటి, సంపత్, కుమార్, రాజు ,పుష్ప రాజ్, సూర్య ప్రవీణ్, కీర్తి రమణ, శంకర్ ,నాగరాజు, సీనియర్ జనసైనికులు జనసేన రాము తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ పోలీసులు మద్యపానం" వ్యసనవిముక్తి "కేంద్రం

## నవోదయం 2.0పై గ్రామలలో ప్రచారరథంతో అవగాహన

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఏప్రిల్ 12:**




నంద్యాల జిల్లా ప్రోహిబిషన్ మరి ఎక్స్చేంజ్ అధికారి ఎస్ రవికుమార్ ఆదేశాల మేరకు నందికొట్కూరు ఎక్సైజ్ స్టేషన్ ఎందుకు శనివారం మద్యపానము, నాటుసారా, మత్తు కలిగించే పదార్థాలను సేవించడం వలన కలిగేటువంటి దుష్ప్రభావాలు, గురించి "వ్యసనవిముక్తి" కేంద్రము ప్రారంభించడం జరిగింది.

మద్యము, మత్తుకు వ్యసనం కావడము, బానిస కావడము వలన సామాజికంగా, ఆర్థికంగా, ఆరోగ్యపరంగా కలిగే అనర్థాలను గురించి వివరించడం జరిగింది.

సామాజికంగా వెలివేతకు గురి అవుతారు, సామాజికంగా గౌరవం, బహిష్కరణకు గురి అవుతారు. శరీరంలో మందుకి బానిస మందుకి బానిస అవడం వల్ల ఆరోగ్యకరంగా సామాజికపరంగా ఫ్యామిలీపరంగా చాలా సమస్యలు లేవనెత్తుతాయి. మనిషికి సమస్యలు అన్నింటికీ కూడా మద్యము సేవించడం పరిష్కారము కాదు. మద్యము సేవించడము అలవాటు వ్యసనం కాకూడదు, ఇంట్లో గొడవలు, కుటుంబ కలహాలు ఈ వ్యసనానికి కారణం కాకూడదు. అనేక సమస్యలు ఉండొచ్చు వాటిని సరి చేసుకోవాలి తప్ప మద్యానికి బానిస కాకూడదు.. ఒకసారి మద్యానికి బానిస అయితే ఒకేసారి ఆపడం కుదరదు. బానిసైనారు వాళ్ళు మత్తును ఆపాలని మనోధర్యంగా నమ్మాలి.

మత్తు ఆపేసిన తర్వాత కొందరి శరీరంలో కొన్ని లక్షణాలు వస్తాయి. అవి ఏందంటే నిద్ర పట్టకపోవడం, మూర్ఛ రావడము, కాళ్ల చేతులు వణకడము, ఆత్రుతగా మాట్లాడడం, అటు ఇటు తిరగడం, అనాలోచితంగా మాట్లాడటం, మతిస్థిమితం లేకుండా పడిపోవడం ఇలా అనేక రకాలుగా ప్రవర్తిస్తుంటారు. వీటిని ట్రీట్మెంట్ ఇచ్చుకోవాలి అంటే డాక్టర్ని కలపాలి కాబట్టి ఎవరైనా గాని మందు ఆపాలనుకుంటున్నారు అంటే వాళ్ళు సైకియాట్రిక్ డాక్టర్ ని కలవాలి అని డాక్టర్ రాజశేఖర్ చెప్పారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.రాముడు, నందికొట్కూరు సామాజిక ఆరోగ్య కేంద్రం యొక్క డాక్టర్ కె. రాజశేఖర్ జనరల్ ఫిజిషియన్ , నందికొట్కూరు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ల రామాంజనేయులు, ఎస్.ఐలు జఫరుల్లా, భాష్యం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాటుసార నిర్మూలన కోసం చేపట్టిన నవోదయం 2.%ూ% కార్యక్రమములో భాగంగా నందికొట్కూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ప్రచార రథము ద్వారా నాటు సారా ప్రభావిత ప్రాంతాలలో అవగాహన కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరు మండలంలోని దామగట్ల, మిడ్తూర్ మండలంలోని నాగలూటీ, దేవనూరు, జూపాడుబంగ్లా మండలంలోని, పారుమంచాల, పి.లింగాపురం, గ్రామాలలో ప్రజలకు అవగాహన చేయడం జరుగును.. ప్రచార రథంతో పాటుగా మధుప్రసాద్ కానిస్టేబుల్ ఉన్నారు.




# వైభవంగా తుంబురు తీర్థ ముక్కోటి

## తీర్థ స్నానమాచరించిన 14,500పైగా భక్తులు

**తిరుమల, ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 12.**

తిరుమలలోని శేషాచల అడవుల్లో ప్రముఖ తీర్థంగా భాసిల్లుతున్న తుంబురు తీర్థ ముక్కోటిలో దాదాపు 14,500 మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఏప్రిల్ 11న సుమారు 3,500 మంది, ఏప్రిల్ 12న 11వేల మంది భక్తులు తీర్థ స్నానం ఆచరించారు.టీటీడీ విస్తృత ఏర్పాట్లు

టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి ఆదేశాల మేరకు అధికారులు తుంబురు తీర్థానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 11వ తేదీ ఉదయం 5 గంటల నుండి నిరంతరాయంగా అన్న ప్రసాదాలు, మజ్జిగ, తాగునీరు భక్తులకు శ్రీవారి సేవకులు పంపిణీ చేశారు. ఇంజినీంగ్ విభాగం ఆధ్వర్యంలో భక్తులు భోజనం చేసేందుకు వీలుగా అవసరమైన షెడ్లు, మార్గమధ్యంలో నిచ్చెనలు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఆస్తమా, స్థూల కాయం, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారిని తీర్థానికి అనుమతించలేదు. పాప వినాశనం వద్ద పార్కింగ్ సమస్య కారణంగా భక్తులను ఆర్టీసీ బస్సులలో మాత్రమే అనుమతించారు. తుంబురు తీర్థానికి అటవీ మార్గంలో వెళ్ళే సమయంలో భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రేడియో మరియు బ్రాడ్కాస్టింగ్ విభాగం ఆధ్వర్యంలో నిరంతరాయంగా ప్రకటనలు చేశారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తుంబురు తీర్థం, పాపావినాశనం వద్ద పారిశుధ్యానికి పెద్దపీట వేస్తూ అదనపు సిబ్బందిని నియమించారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తులకు సేవలందించేందుకు అంబులెన్స్లను, పారామెడికల్ సిబ్బందిని అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. మరోవైపు టీటీడీ భద్రతా విభాగం, పోలీసులు, అటవీశాఖ సిబ్బంది కలసి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. టీటీడీ కల్పించిన అన్నప్రసాదాలు, తాగునీరు, ఇతర ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.టీటీడీ చేసిన ఏర్పాట్లను డిప్యూటీ ఈవో శ్రీ రాజేంద్ర, వీజీవో శ్రీ సురేంద్ర, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మధుసూదన్, వైద్య అధికారి డాక్టర్ కుసుమ కుమారి, తదితరులు పర్యవేక్షించారు.

# ఇంటర్ ఫస్టియర్లో 423/ 440 మార్కులతో కాలేజీ టాపర్ గా పూజిత.

**మంత్రాలయం న్యూస్:** మంత్రాలయం మండల పరిధిలోని సూగూరు గ్రామానికి చెందిన ఈనాడు రిపోర్టర్ శ్రీధర్ స్వామి సుధామణిల కూతురు జే. పూజిత ఇంటర్ ఫస్టియర్ ఫలితాలలో 423/440 మార్కులతో కాలేజీ





కాలేజీ టాపర్ గా నిలిచి ప్రతిభ చాటింది.

కర్నూలులోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో 2024, 25 సంవత్సరానికి గాను ఇంటర్ ఫస్టియర్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి ఫస్ట్ ఇయర్ ఫలితాలలో కర్నూలు శ్రీ గాయత్రీ జూనియర్ కళాశాలలో బైపిసి ఫస్ట్ ఇయర్ చదువుతున్న జే. పూజిత 440

మార్కులకు గాను 423 మార్కులతో కాలేజీ ఫస్ట్ వచ్చి, టాపర్ గా జే పూజిత నిలిచిందని కాలేజీ ప్రిన్సిపాల్ వాసు బాబు తెలిపారు .ఫస్ట్ ఇయర్ బైపిసి లో కాలేజీ టాపర్ గా నిలిచిన పూజితను కళాశాల యాజమాన్యం వాసు బాబు, అధ్యాపకులు శివ కుమారి,వనజ, రామకృష్ణ కల్పన, శివాని శాస్త్రి , ఫయాజ్ ,రామ్ , స్వర్ణలత, షాహిదా, సత్య , సుకన్య, సంధ్య తదితరులు అభినందించారు.

# వైభవంగా ముగిసిన శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు

**తిరుమల, ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 12.**





తిరుమల శ్రీవారి ఆలయం వెనుక వైపు గల వసంతోత్సవ మండపంలో గత మూడురోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన సాలకట్ల వసంతోత్సవాలు శనివారం కన్నులపండుగగా ముగిశాయి.

తొలిరోజు, రెండవరోజు శ్రీ మలయప్పస్వామివారు తన ఉభయదేవేరులతో కలిసి వసంతోత్సవంలో పాల్గొనగా చివరిరోజున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పతో బాటుగా శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామివారు, శ్రీరుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామివారు వసంతోత్సవ సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆద్యంతం నేత్రపర్వంగా సాగింది.మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. ఒకే వేదికపై సమస్త మూలవరులను దర్శించిన భక్తులు తన్మయత్వంతో పులకించారు. అదేవిధంగా ప్రతినెలా పౌర్ణమినాడు తిరుమలలో నిర్వహించే గరుడుసేవను వార్షిక వసంతోత్సవాల కారణంగా టీటీడీ రద్దు చేసింది.ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, పేష్కార్ శ్రీ రామ కృష్ణ, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ కోదండరాముని రథోత్సవం

**తిరుపతి ,ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 12.**



ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది.శ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరాములవారు రథాన్ని అధిష్టించి గ్రామవీధుల్లో విహరించారు. భజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూల శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే.ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో శ్రీ వి వీరబ్రహ్మం, డెప్యూటీ ఈవో శ్రీ నటేష్ బాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, ఇంజినీరింగ్ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# 11 ఏళ్ల తరవాత తల్లిడంద్రుల చెంతకు తనయుడు

మెదక్: కొన్ని సందర్భాల్లో రీల్ సీన్స్ రియల్ సీన్స్ గా మారినప్పుడు ఆశ్చర్యపోవడం తప్పనిసరి అవుతుంది. తాజాగా ఇలాంటి ఘటనే మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. 2014లో 19 ఏళ్ళ వయసులో ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఓ యువకుడు 11 ఏళ్ల తర్వాత తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేరాడు. కనిపోయించకుండా పోయిన కుమారుడు తమ చెంతకు చేరడంతో తల్లిదండ్రుల ఆనందానికి హద్దే లేకుండా పోయింది. కుటుంబంలో ఆనందం వెల్లువిరిసింది. 11 ఏళ్ల క్రితం కనిపోయించకుండా పోయిన కుమారుడిని మెదక్ జిల్లా పోలీసులు తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. 2014లో 19 ఏళ్ళు ఉన్నప్పుడు ఇంజనీరింగ్ చదివేటప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు తేజసాయి. 11 ఏళ్లుగా కుమారుడి కోసం తల్లిదండ్రులు శ్రీనివాసరావు, శారద వెతుకుతున్నారు. ఈ నెల ఏప్రిల్ 3న మెదక్ ఎస్పీని కలిసి విషయం తెలియజేశారు తేజసాయి తల్లిదండ్రులు. రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో సాయితేజ బెంగళూరులో ఉన్నట్టు- గుర్తించారు. పోలీసులు బెంగళూరు వెళ్లి సాయితేజని తీసుకువచ్చి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పజెప్పారు. బెంగళూరులో పెళ్లి చేసుకుని అక్కడే హోటల్ నడుపుకుంటూ స్థిరపడ్డాడు తేజసాయి. సొంతంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో తల్లితండ్రులను వీడి బెంగళూరు వెళ్లినట్టు- తేజసాయి

తెలిపాడు. ఇంట్లో నుంచి వెళ్లిపోయి చెడు వ్యసనాలకు, చెడు మార్గాల్లో పయనించకుండా సొంతంగా వ్యాపారం ప్రారంభించి స్థిరపడ్డ తేజసాయిని పోలీసులు అభినందించారు. మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డికి తేజసాయి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# మీ ఎముకలు గుల్లే





చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు కూల్ డ్రింక్స్ చాలా ఇష్టంగా తింటూ ఉంటారు. దప్పిక తీరుతుందని చల్లగా ఉండే పానీయాన్ని గడ గడ తాగేస్తుంటారు. ఇంటికి అతిథులు వచ్చినా, మనం టూర్లకు వెళ్లినా.. కూల్ డ్రింక్ కచ్చితంగా ఉండాలి. అయితే.. కూల్ డ్రింక్స్‌లో చక్కెర ఎక్కువగా ఉంటుంది తప్ప ఎలాంటి పోషకాలు ఉండవు. ఈ పానీయాలు కేవలం బరువు పెంచుతాయి తప్ప... ఎలాంటి ప్రయోజనాలు ఉండవు అని హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ చేసిన అధ్యయనంలో తేలింది. మితిమీరి కూల్ డ్రింక్స్ తాగే పురుషులకు గుండె జబ్బు వచ్చే ప్రమాదం 20 శాతం వరకు పెరుగుతుంది. శీతల పానీయాలు తాగే పిల్లలు ఏటా 3 - 5 కిలోల బరువు పెరుగుతున్నట్టు పరిశోధకులు చెబుతున్నారు. ఈ పానీయాలలోని యాసిడ్స్ దంతాల ఎనామిల్‌కు హాని కలిగిస్తాయి, ఇది దంత సమస్యలను కలిగిస్తుంది. ఇంకా, వాటిలోని కెఫిన్ నిద్రలేమికి దారితీస్తుంది. కార్బొనేటేడ్ కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని ప్రముఖ పోషకాహార నిపుణురాలు లవ్‌నీత్ బాత్రా సూచించారు. వీటిలోని ఫాస్ఫోరిక్ యాసిడ్ ) ఎముకలు, శరీరంలోని ఇతర భాగాల నుంచి కాల్షియంను లీచ్ చేస్తుంది, ఇది కాల్షియం లోపానికి దారి తీస్తుంది. దీన్నే హైపోకాల్సెమియా అని పిలుస్తారు. ఎముకల ఆరోగ్యానికి హాని చేసే పోషకాలు గురించి పోషకాహార నిపుణురాలు లవ్‌నీత్ బాత్రా ఇన్‌స్టాగ్రామ్ పేజ్‌లో షేర్ చేసుకున్నారు. మెగ్నీషియం ఎముకల నిర్మాణంలో భాగం అవుతుంది, ఇది ఎముకలను బలోపేతం చేయడానికి కీలక పాత్ర పోషిస్తుంది.





పొటాషియం.. ఇది మూత్రపిండాలలో కాల్షియం ఆరోగ్యకరమైన సంతులనాన్ని నిర్వహించడానికి సహాయపడుతుంది, ఇది ఎముకలు నష్టం నుంచి రక్షిస్తుంది, శరీరంలో యాసిడ్-బేస్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.

విటమిన్ సి.. పండ్లు కూరగాయల్లో సమృద్ధిగా లభించే విటమిన్ సి.. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది, ఎముకలు విరిగిపోకుండా కాపాడుతుంది.

ఫాస్ఫరస్.. ఎముకల పెరుగదలకు ఫాస్ఫరస్ ముఖ్యమైనది, ఎముకల అభివృద్ధికి తగినంత ఫాస్ఫరస్ తీసుకోవడం చాలా ముఖ్యం. తక్కువ సీరం ఫాస్ఫేట్ స్థాయిలు పోషకాహార లోపాన్ని సూచిస్తాయి, ఇది ఎముకల పగుళ్లు, బోలు ఎముకల ప్రమాదాన్ని పెంచుతుంది. విటమిన్ కె.. ఆకు కూరలలో ఉండే విటమిన్ కార్బాక్సిలేషన్ అనే ప్రక్రియ ద్వారా ఎముకల ఆరోగ్యాన్ని రక్షిస్తుంది. ఇది ఎముక ప్రోటీన్‌లను సక్రియం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. 200 కంటే ఎక్కువ ఎంజైమ్‌లలో కీలకమైన భాగం. కొల్లాజెన్ సంశ్లేషణ, ఎముక ఖనిజీకరణకు ఇది అవసరం. తగినంత ప్రోటీన్ తీసుకోవడం వల్ల కాల్షియం శోషణను మెరుగుపడుతుంది, ఇన్సులిన్ లాంటి గ్రోత్ ఫ్యాక్టర్ 1 స్రావాన్ని పెంచుతుంది, లీన్ బాడీ మాస్‌ను ప్రోత్సహించి ఎముక ఆరోగ్యాన్ని సానుకూలంగా ప్రభావితం చేస్తుంది. ఆరోగ్యాన్ని దెబ్బతీసే కూల్ డ్రింక్స్‌కు బదులుగా పుచ్చకాయ, కర్బూజ పండ్లు, పండ్ల రసాలు తీసుకోవాలి. వీటిలోనూ చక్కెర లేకుండా తాగితే మరీ మంచిది. సాధ్యమైనంత వరకు మంచి నీటిని ఎక్కువగా తాగేందుకు ప్రయత్నించాలి.

# పిల్లలకి అస్సలు పెట్టొద్దు..

ఆహారం అనేది ఆరోగ్యం విషయంలో కీ రోల్ పోషిస్తాయి. ఈ నేపథ్యంలోనే పిల్లలకి ఇచ్చే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుల కోసం ప్రతి పేరెంట్ ఎన్నో విధాలుగా ఆలోచిస్తారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలలో ఆహారం కీ రోల్ పోషిస్తుంది. అయితే, కొన్ని ఫుడ్స్ పిల్లలకి అస్సలు మంచిది కాదు. వీటిని తీసుకోవడం వల్ల పిల్లలకి జ్ఞాపకశక్తిని మందగించి, బ్రెయిన్‌ని బలహీనపరుస్తాయి. అవేంటో తెలుసుకోండి.

కలర్ ఫుడ్స్.. రంగురంగుల ఫుడ్స్ జిలేబీలు, రంగుల స్వీట్స్, పొడి షుగర్ ఫుడ్స్ ఆహారాలలో ఆర్టిఫీషియల్ కలర్స్ ఉంటాయి. దీని వల్ల పిల్లల్లో ఆందోళన, తలనొప్పి, హైపర్ యాక్టివిటీ, అభిజ్ఞా సమస్యలు వస్తాయి.

మెదడు అభివృద్ధిపై ట్రాన్స్‌ఫ్యాట్స్.. ట్రాన్స్ ఫ్యాట్స్ ఎక్కువగా ఉండే ఆహారం మెదడు ఆరోగ్యం, అభివృద్ధిపై నెగెటీవ్ ఎఫెక్ట్‌ని చూపిస్తాయి. ఈ కొవ్వులు ఎక్కువగా ఫ్రై చేసిన ఫుడ్స్, ప్యాకేజ్డ్ స్నాక్, హైడ్రోజనేటేడ్ నూనెలతో ప్రాసెస్డ్ ఫుడ్స్ ఉంటాయి. ఇలాంటి ఫుడ్స్ పిల్లల మెదడులో వాపుని పెంచుతాయి. అదనంగా, ఇది రసాయనిక సెరటోనిన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. దీని ప్రభావం డిప్రెషన్, మెమరీలాస్‌కి దారికతీస్తుంది.









కెఫిన్.. చాలా మంది కాఫీలో మాత్రమే కెఫిన్ ఉంటుందనుకుంటారు. కానీ, చాక్లెట్స్, టీ, కాఫీల్లోనూ కెఫిన్ ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల జలుబు వంటి సమస్యలు వస్తాయి. అంతేకాకుండా మరిన్ని సమస్యలు కూడా వస్తాయి. పిల్లలు రోజుకి 45 మిల్లీగ్రాముల వరకూ కెఫిన్ ఎక్కువగా ఉండే ఫుడ్స్‌ని తీసుకోవచ్చు. కెఫిన్ డ్రింక్స్ తీసుకుంటే వణుకు, భయం, నిద్రలేమి, హైపర్‌యాక్టివ్, తలనొప్పి, కడుపునొప్పులు వస్తాయి. ఇవన్నీ వారి మానసిక అభివృద్ధిని ప్రభావితం చేస్తాయి.

షుగర్ ఫుడ్స్.. పిల్లలకి షుగర్ ఫుడ్స్ అంటే ఇష్టం. కానీ ఈ స్వీట్స్ పిల్లల బ్రెయిన్ హెల్త్‌కి మంచిది కాదు. స్వీట్స్, ఐస్‌క్రీమ్స్, కేక్స్, బేబీ ఫుడ్స్‌లో చక్కెర చాలా ఉపయోగించబడుతుంది. దీని వల్ల హైపర్ యాక్టివిటీకి కారణమవుతుంది. పిల్లల ఆకలిని ప్రభావితం చేస్తుంది.

పిల్లలు ఇష్టపడే స్నాక్స్.. పిల్లలు ప్యాకేజ్డ్ చిప్స్, బర్గర్స్, పిజ్జా, నూడుల్స్ ఇలాంటి ప్రాసెస్డ్ ఫుడ్స్ వారి మూడ్ స్వింగ్స్, ప్రవర్తనల్లో మార్పులతో పాటు తలనొప్పి, హైపర్ యాక్టివిటీ సమస్యలని పెంచుతాయి. వీటిని తీసుకోవడం వల్ల వారిలో సామర్థ్యం తగ్గుతాయి.

# మొటిమల మాయం...



ముఖ సౌందర్యాన్ని రెట్టింపు చేయడంలో పసుపుది కీలక పాత్ర. పసుపులోని యాంటీ ఎలర్జిక్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ సెప్టిక్, యాంటీ మైక్రోబియల్, యాంటీ ప్యారసైటిక్, యాంటీఆక్సిడెంట్ గుణాలు.. చర్మ సమస్యలను దూరం చేస్తాయి. అందుకే ఫేస్‌ప్యాక్, స్క్రబ్.. వంటివి తయారుచేసే క్రమంలో దీన్ని విరివిగా వాడుతుంటాం. అలాగే పసుపు మొక్క వేళ్ల నుంచి తీసిన ఎసెన్షియల్ ఆయిల్ వల్ల కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు సౌందర్య నిపుణులు.

మొటిమలు, మచ్చలను మాయం చేస్తుంది..! మొటిమల సమస్యతో బాధపడేవారికి పసుపు ఎసెన్షియల్ ఆయిల్.. గొప్ప ఔషధంలా పని చేస్తుంది. పసుసు వేళ్ల నుంచి తీసిన ఎసన్షియల్ ఆయిల్‌లో యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి మొటిమల సమస్యను దూరం చేయడమే కాకుండా.. వాటి వల్ల వచ్చిన మచ్చలను మాయం చేస్తుంది. రాత్రి పూట పసుపు నూనెను ముఖానికి అప్లై చేసుకుని, ఉదయం శుభ్రం చేసుకుంటే.. మొటిమల సమస్య దూరం అవుతుంది. పాదల పగుళ్లు తగ్గిస్తుంది.. పసుపు అద్భుతమైన హీలింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. మీరు కాళ్ల పగుళ్లతో బాధపడుతుంటే.. పసుపు నూనె గొప్ప ఔషధంలా పనిచేస్తుంది. మీకు కాళ్ల పగుళ్లు ఉంటే.. రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెలో కొన్ని చుక్కల పసుపు నూనెను వేసి మిక్స్ చేసి రాత్రి నిద్రపోయే ముందు కాళ్లకు అప్లై చేసుకోండి. ఇలా రోజూ చేస్తూ ఉంటే కాళ్ల పగుళ్లు తగ్గుముఖం పడతాయి. వృద్ధాప్య ఛాయలు దూరం.. పసుపు ఎసెన్షియల్ ఆయిల్‌లో ఉన్న యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. దీని కోసం నాలుగు చెంచాల బాదం నూనెలో నాలుగు చుక్కల పసుపు ఎసెన్షియల్ ఆయిల్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో ముఖంపై సన్నని గీతలు, ముడతలు ఉన్నచోట మృదువుగా రుద్దుకోవాలి. తర్వాత ఒక టిష్యూ పేపర్ తీసుకొని ఎక్కువైన నూనెని తుడిచేసుకోవాలి. ఈ చిట్కాను రాత్రి పడుకొనే ముందు రోజూ పాటించడం ద్వారా వృద్ధాప్య ఛాయలు కనుమరుగవుతాయి.









చర్మాన్ని తాజాగా ఉంచుతుంది.. చర్మం తాజాగా ఉండటానికి... ఒకటిన్నర చెంచా ఆలివ్ ఆయిల్‌లో పసుపు వేళ్ల నుంచి తీసిన ఎసెన్షియల్ ఆయిల్ ఒక్క చుక్క వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖంపై రాసుకుని మృదువుగా మర్దన చేసుకోవాలి. ఇలా రోజూ రాత్రి పడుకొనే ముందు చేయడం వల్ల అలసిన చర్మం తిరిగి తాజాదనాన్ని సంతరించుకుంటుంది. ఈ జాగ్రత్తలు తీసుకోండి.. పసుపు వేళ్ల నూనెను నేరుగా చర్మం లేదా కురులపై ఉపయోగించకూడదు. కొబ్బరినూనె, బాదం నూనె, జొజోబా ఆయిల్.. వంటి నూనెలతో కలిపి మాత్రమే వినియోగించాలి. అలాగే దీనిని వీల్కైనంత తక్కువ మోతాదులోనే వాడాలి. అన్నిటికంటే ముఖ్యంగా ఈ నూనెను ఉపయోగించిన తర్వాత చర్మం చాలా సెన్సిటివ్‌గా మారుతుంది. ఫలితంగా సూర్యుడి నుంచి వెలువడే యూవీ కిరణాలను అంతగా తట్టుకో లేదు. ఇది చర్మానికి అప్లై చేసుకున్న తర్వాత ఎండలోకి వెళ్లొద్దు.

# ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు...



ఇందులో మన ఇంట్లో ఉండే ఎన్నో పదార్థాలే చాలా ఆరోగ్య ప్రయోజనాలని ఇస్తాయి. అందులో మెంతులు కూడా ఉన్నాయి. మెంతులని కూరలు, పచ్చళ్ళలో వాడతారు. అంతేకాదు, జుట్టుకి మంచి పోషణని అందించడంలో కూడా మెంతులు ముందుంటాయి. మెంతులు చేదుగా ఉన్నప్పటికీ ఇందులో పోషకాలు, మినరల్స్ శరీరానికి ఎంతో అవసరం. మెంతుల్లో ఫైబర్, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో మెంతుల నీరు తాగడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం.

ఇన్‌ఫ్లమేషన్.. మెంతుల్లో ఎన్నో అణువులు ఉంటాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గించడంలో సాయపడతాయి. కాబట్టి, గౌట్, ఆస్తమా వంటి సమస్యలతో బాధపడేవారు వీటిని తీసుకోవచ్చు. మెంతుల్లో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ సి, నియాసిన్, పొటాషియం, ఐరన్, ఆల్కలాయిడ్స్ కలిగి ఉన్నాయి. అసిడిటీ ఉన్నవారు ప్రతిరోజూ ఉదయాన్నే నానబెట్టిన మెంతులు ఓ టీస్పూన్ తీసుకోవడం మంచిది.


జీర్ణక్రియ.. మెంతుల నీటిని తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. దీనిలోని పీచు పదార్థం అజీర్ణం, మలబద్ధకం, వాతాన్ని నయం చేస్తుంది. ఇది ఆహారం నుండి పోషకాలను బాడీ గ్రహిస్తుంది.

షుగర్.. షుగర్ ఉన్నవారికి మెంతులు ఓ గొప్ప ఔషధమని చెప్పొచ్చు. మెంతుల్లో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించి కంట్రోల్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. రోజు ఉదయాన్నే ఖాళీ కడుపుతో మెంతుల నీరు తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. దీని వల్ల మధుమేహం ఉన్నవారు ఈ నీటిని తాగడం మంచిది. మరీ ముఖ్యంగా నానబెట్టి ఆ నీటిని తాగితే మంచిది.

కొలెస్ట్రాల్ తగ్గడం.. అదే విధంగా, మెంతులను ఫుడ్‌లో చేర్చడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ని కరిగిపోతుంది. ముఖ్యంగా రక్తనాళాలల్లో పేరుకుపోయిన కొవ్వుని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీని వల్ల కార్డియో వాస్కులర్ వంటి వ్యాధులను దూరం చేయడంలో హెల్ప్ చేస్తుంది. ఇమ్యూనిటీ.. మెంతుల్లో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఇమ్యూనిటీ బలపరుస్తుంది. శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది. మెంతులు వాడడం వల్ల చర్మంతో పాటు జుట్టుకి కూడా మేలు చేస్తాయి.??గమనిక: నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# ఈ రసం తాగితే.. షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది..!





బొప్పాయి పండులోనే కాదు, బొప్పాయి ఆకులోనూ పోషకాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. బొప్పాయి ఆకు రసం ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచడానికి ఉపయోగించే అత్యంత దేశీ రెమెడీ. దీనిలోని పాపైన్, చైమోపాపైన్ వంటి ఎంజైమ్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. కడుపుఉబ్బరం, ఇతర జీర్ణరుగ్మతులను నివారిస్తుంది. ఇందులోని ఆల్కలాయిడ్ సమ్మేళనం చుండ్రు, బట్టతల రాకుండా నివారిస్తుంది. బొప్పాయి ఆకులో విటమిన్ ఏ, సి, ఇ, కె, బి అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. బొప్పాయి ఆకు టీ, జ్యూస్, మాత్రలు.. అనారోగ్యాల చికిత్సకు, ఆరోగ్యాన్ని రక్షించడానికి తోడ్పడతాయి. బొప్పాయి ఆకుల జ్యూస్ తాగితే.. ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో ఈ స్టోరీలో చూద్దాం.

డెంగీ చికిత్స చేస్తుంది.. డెంగీ లక్షణాల చికిత్సకు బొప్పాయి ఆకుల రసాన్ని సాధారణంగా ఉపయోగిస్తారు. జ్వరం, అలసట, తలనొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు, వాంతులు వంటి డెంగీ లక్షణాల నుంచి ఉపశమనం ఇస్తుంది. డెంగీతోబాధపడుతున్న వందలాది మంది వ్యక్తులపై చేసిన మూడు అధ్యయనాలు.. బొప్పాయి ఆకు సారం రక్తంలో ప్లేట్‌లెట్ స్థాయిలను విపరీతంగా పెంచడంలో సహాయపడినట్లు కనుగొన్నారు.

రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గిస్తుంది.. షుగర్ పేషెంట్స్ బొప్పాయి రసం తాగితే.. డయాబెటిస్ కంట్రోల్‌లో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది తరచూ తీసుకుంటే.. డయాబెటిస్‌కు ఔషధంగా ఉపయోగపడుతుంది. బొప్పాయి ఆకులలో అధికంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు.. రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్యాంక్రియాస్‌లోని ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలను నష్టం, అకాల మరణం నుంచి రక్షిస్తుంది.

జీర్ణక్రియకు మేలు చేస్తుంది.. బొప్పాయి ఆకు జ్యూస్.. గ్యాస్, ఉబ్బరం, గుండెల్లో మంట వంటి జీర్ణ లక్షణాలను తగ్గిస్తుంది. బొప్పాయి ఆకులో ఫైబర్ ఉంటుంది, ఇది జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఇది పెద్ద ప్రోటీన్‌ను చిన్నదిగా, సులభంగా జీర్ణమయ్యే ప్రోటీన్‌లు, అమైనో యాసిడ్‌గా విభజిస్తుంది. ఇది మలబద్ధకం, గుండెల్లో మంట, ప్రకోప ప్రేగు సిండ్రోమ్ వంటి జీర్ణక్రియ సమస్యలను పరిష్కరిస్తుంది.

యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయ్.. బొప్పాయి ఆకుల్లో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇది కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులకు చికిత్స చేయడానికి తోడ్పడుతుంది. బొప్పాయి ఆకు సారం ఆర్థరైటిస్‌తో ఉన్న ఎలుకల పాదాలలో మంట, వాపును గణనీయంగా తగ్గిస్తుందని ఒక అధ్యయనం కనుగొంది.

జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.. బొప్పాయి ఆకుల రసాన్ని తలకు అప్లై చేస్తే.. జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది. శరీరంలో అధిక స్థాయి ఆక్సీకరణ ఒత్తిడి జుట్టు రాలడానికి దోహదం చేస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందువల్ల, యాంటీఆక్సిడెంట్-రిచ్ డైట్ తినడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి, జుట్టు పెరుగుదలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

బొప్పాయి రసంలో యాంటీ ఫంగల్ లక్షణాలు.. చుండ్రు సమస్యను నివారిస్తాయి. బొప్పాయి రసాన్ని తాగితే.. మృదువైన, ప్రకాశవంతమైన చర్మాన్ని పొందవచ్చు. బొప్పాయిలో పాపైన్ అనే ప్రోటీన్ కరిగించే ఎంజైమ్ ఉంటుంది. ఇది ఎక్స్‌ఫోలియెంట్‌గా పనిచేస్తుంది, ఇది ఎక్స్‌ఫోలియెంట్‌గా పనిచేస్తుంది, తద్వారా దుమ్ము, చనిపోయిన చర్మ కణాలను తొలగించడంలో సహాయపడుతుంది. మొటిమలు రాకుండా నివారిస్తుంది.

# లిక్విడ్ లిప్‌స్టిక్ వేస్తే....



లిప్‌స్టిక్ అనేది పెదాల అందాన్ని రెట్టింపు అవుతుంది. అయితే, ఇందులో లిక్విడ్ లిప్‌స్టిక్ అంటే క్రేజ్ ఉంటుంది.మరి ఈ లిప్‌స్టిక్ ఎలా అప్లై చేయాలి. ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో పూర్తి వివరాలు తెలుసుకోండి.

చాలా మందికి మేకప్ వేసుకోవడం అంతగా ఇష్టం ఉండదు. కానీ, లిప్‌స్టిక్ మాత్రం వేసుకుంటారు. అయితే, అందులో లిక్విడ్ లిప్‌స్టిక్ అంటే చాలా మందికి ఇష్టం. దీనిని పెర్ఫెక్ట్‌గా అప్లై చేయకపోతే చూడ్డానికి అంత బాగోదు. పెదాలపై సరైన విధంగా లిప్‌స్టిక్ అప్లై చేయాలంటే కొన్ని టిప్స్ పాటించాలి. అవేంటో తెలుసుకోండి.

ముందుగా మాయిశ్చరైజ్ రాయండి.. పెదాలపై లిప్‌స్టిక్ రాయడానికి ముందు మాయిశ్చరైజ్ రాయండి. దీంతో పెదాలు హైడ్రేట్ అవుతాయి. లేకపోతే లిప్‌స్టిక్ సరిగ్గా సెట్ అవ్వదు. కాబట్టి, ముందుగా మాయిశ్చరైజర్ అప్లై చేసి ఆ తర్వాత లిప్‌స్టిక్ రాయండి. అయితే, లిక్విడ్ లిప్‌స్టిక్స్ వేసేటప్పుడు ఇవన్నీ అవసరం లేదు. పెదాలు మరీ గరుకుగా ఉన్నప్పుడు మాత్రమే ఈ లిప్‌స్టిక్‌ని అప్లై చేయండి. అయితే, ఈ లిప్‌స్టిక్ అప్లై చేసే ముందు మాయిశ్చరైజర్‌ని పలుచగా రాయాలి.

మీ పెదాల ఆకృతి సరిగ్గా కనిపించాలంటే ముందుగా లిప్‌లైనర్ వాడండి మనం ఏ రంగు లిప్‌స్టిక్ వాడతామో ఆ రంగులో కాస్త సన్నగా ఉండే లిప్‌లైనర్ వాడాలి. అప్పుడు దాంతో పెదాల చుట్టూ లైనింగ్ చేయండి. ఆ తర్వాత లిప్‌స్టిక్ వేయండి. తర్వాత లిప్ లైనర్‌తో రీటచ్ చేయండి. ముఖ్యంగా పెదాల మూలలని సరిచేయండి. అప్పుడు లిక్విడ్ లిప్‌స్టిక్ చాలా ఎక్కువసేపు అందంగా ఉంటాయి.

లిక్విడ్ లిప్‌స్టిక్స్ ఎక్కవగా క్రీమీ పిగ్మెంటేషన్ ఉంటుంది. కాబట్టి, ఇది ఎక్కువగా అప్లై చేయొద్దు. కేవలం ఓ స్ట్రోక్ సరిపోతుంది. రెండు మూడుసార్లు అప్లై చేయాల్సిన అవసరం లేదు. వేశాక కాసేపు ఆరనివ్వండి.

టిష్యూ.. పెదాలపై లిప్‌స్టిక్ మరీ ఎక్కువగా ఉందనిపిస్తే ఓ టిష్యూ వేసి కాస్తా కొద్దిగా నొక్కాలి. అప్పుడు ఎక్కువగా ఉన్న కలర్ పేపర్‌లోకి వెళ్తుంది. మిగిలిన లిప్‌స్టిక్ అలానే ఉంటుంది. అంతేకానీ, గుడ్డతో రుద్దడం, నీటితో కడగడం లాంటి తప్పులు మాత్రం చేయొద్దు. సూట్ అయ్యే కలర్.. మందుగా సరిపోయే లిప్ కలర్ ఎంచుకోండి. ఆపై దానికి సరిపోయే లిప్‌లైనర్ ఎంచుకోండి. సరైన లిప్ లైనర్‌తో సన్నని లిక్విడ్ లిప్‌స్టిక్‌ని వేయండి. అప్పుడు పెదాలు మంచి రంగుతో చూడ్డానికి చక్కగా కనిపిస్తాయి. ఇలా చిన్న చిన్న టిప్స్ పాటిస్తే లిప్స్ చాలా చక్కగా అందంగా కనిపిస్తాయి. అయితే, మీరు లిప్‌స్టిక్ ఎంచుకునేటప్పుడు మంచి బ్రాండ్స్ వేసుకోవడం మంచిది. ఇక మీ డ్రెస్సెస్‌కి సూట్ అయ్యే కలర్స్‌ని ఎంచుకోండి.

# అప్పుడు కసబ్‌ని గన్‌తో కాల్చేద్దామనుకున్నా.. దావూద్, హాఫీజ్ లాంటోళ్లని ఉరితీయాలి: దేవిక



దిల్లీ: ముంబయి ఉగ్రదాడి ఘటనలో కీలక సూత్రధారి తహవ్వుర్ రాణా భారత్‌కు చేరుకున్నాడు. అమెరికా నుంచి దిల్లీ విమానాశ్రయానికి అతడిని తీసుకొచ్చారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో అతడిని ఎన్ఐఏ ప్రధాన కార్యాలయానికి తరలించినట్లు సమాచారం. దీంతో ఎన్ఐఏ ప్రధాన కార్యాలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. తహవ్వుర్ రాణాను భారత్‌కు తీసుకురావడంపై ముంబయి దాడుల్లో బాధితురాలు, ఉగ్రవాది అజ్మల్ కసబ్‌ను గుర్తించడంలో కీలక సాక్షిగా ఉన్న దేవికా రోటావన్ హర్షం వ్యక్తం చేశారు. అతడిని అమెరికా నుంచి తీసుకురావడం భారత ప్రభుత్వం సాధించిన పెద్ద విజయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఓ ప్రముఖ వార్తా సంస్థతో మాట్లాడారు. “తహవ్వుర్ రాణాను తీసుకొచ్చినందుకు భారత్, అమెరికా ప్రభుత్వాలకు ధన్యవాదాలు. రాణానుంచి అనేక కీలక వివరాలు రాబట్టొచ్చు.. పాకిస్థాన్‌లో ఇప్పటికీ దాగి ఉన్న ఉగ్రవాదులను పెంచి పోషించేవారి పేర్లు బయటకు రావొచ్చు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మోదీ సర్కార్ కృషిచేస్తోంది. పాకిస్థాన్‌లో దాగి ఉన్న ఉగ్రవాదులతో పాటు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సరే.. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చేవారిని శిక్షించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నా. అజ్మల్ కసబ్ మాదిరిగా ఉగ్రవాదులకు మరణ దండన విధించాలి. పాకిస్థాన్‌లో ఉన్న దావూద్ ఇబ్రహీం, హాఫీజ్ సయీద్ ఇతర కీలక సూత్రధారులను భారత్‌కు తీసుకొచ్చి ఉరిశిక్ష విధించాలి. ఇప్పటికీ పొరుగు దేశంలో ఉన్న ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేవారిని, కసబ్ లాంటి కిరాతకుల్ని తయారుచేసే వారిని అంతం చేయాలి. అప్పుడే ముంబయి దాడుల్లో బాధితులకు న్యాయం జరుగుతుంది” అన్నారు. ముంబయి దాడి ఘటన రోజును గుర్తు చేసుకున్న ఆమె.. కసబ్‌ను చూపెట్టినప్పుడు తనకెవరైనా తుపాకీ ఇస్తే కాల్చేద్దామనుకున్నానన్నారు. అప్పుడు తన వయస్సు పదేళ్లేనని చెప్పారు.




## తహవ్వుర్ రాణా అరెస్టు

ముంబయి ఉగ్రదాడి కేసులో ప్రధాన సూత్రధారి తహవ్వుర్ హుస్సేన్ రాణాను భారత్‌కు తీసుకొచ్చారు. అమెరికా నుంచి అతడిని తీసుకువచ్చిన ప్రత్యేక విమానం గురువారం సాయంత్రం దిల్లీ విమానాశ్రయంలో దిగింది. రాణాను అదుపులోకి తీసుకున్నట్లు ఎన్ఐఏ అధికారికంగా ధ్రువీకరించింది. అతడిని పటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుజాగ్రత్తగా కోర్టు ప్రాంగణాన్ని పూర్తిగా ఖాళీ చేయించిన పోలీసులు.. మీడియా ప్రతినిధులనూ బయటకు పంపించారు. అనంతరం రాణాను తిహాడ్ జైలుకు తరలించనున్నట్లు సమాచారం. దీంతో ఆయా ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. తహవ్వుర్ రాణాను ఎన్ఐఏ అదుపులోకి తీసుకున్న అనంతరం కొన్ని ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అతడిని చట్టం ముందు నిలబెట్టేందుకుగాను ఏళ్ల తరబడి నిరంతర సమష్టి ప్రయత్నాలు చేసినట్లు ఎన్ఐఏ ఓ ప్రకటనలో తెలిపింది.“ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ, భారత విదేశాంగ శాఖ, హోంశాఖ, యూఎస్‌డీఓజే, యూఎస్ స్కై మార్షల్, అమెరికాలోని సంబంధిత అధికారుల సమన్వయంతో ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యింది” అని పేర్కొంది. ఇదిలాఉంటే, తహవ్వుర్‌ను ఈ మధ్యాహ్నమే దిల్లీకి తరలించారన్న వార్తలు వచ్చినప్పటికీ.. ఎన్ఐఏ ఈ విషయాన్ని సాయంత్రం ధ్రువీకరించడం గమనార్హం.

ఈ కేసులో ఎన్ఐఏ తరపున సీనియర్ అడ్వకేట్ దయాన్ కృష్ణన్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేందర్ మాన్ హాజరయ్యారు. ఇప్పటికే వీరిద్దరూ కోర్టు ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే, ఈ కేసు గురించి స్పందించేందుకు వారు నిరాకరించారు. మరోవైపు, నిందితుడు తహవ్వుర్ రాణా తరపున దిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి పీయూష్ సచ్‌దేవ హాజరైనట్లు సమాచారం.

## వడగళ్లు.. పిడుగుల బీభత్సం.. బిహార్‌లో 25 మంది మృతి

బిహార్‌లో వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. మరోసారి ఉరుములు మెరుపులతో పిడుగులు పడ్డాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల పిడుగుపాటు ఘటనల్లో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్క నలంద జిల్లాలోనే 18 మంది మృతి చెందినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. సివాన్‌లో ఇద్దరు చనిపోగా.. కతిహార్, దర్భంగా, బెగుసరాయ్, భాగల్‌పుర్, జహానాబాద్‌లలో ఒక్కో మరణం నమోదైంది.

బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. బుధవారం సైతం రాష్ట్రంలోని నాలుగు జిల్లాల పరిధిలో పిడుగులు పడి 13 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. అధికారిక గణాంకాల ప్రకారం 2023లో పిడుగుపాటు కారణంగా రాష్ట్రంలో 275 మంది మృతి చెందారు.

## ఆయుష్మాన్ భారత్ అమలు చేయని పార్టీలు ఓడాయి.. ఇప్పుడు టీఎంసీ వంతు: జేపీ నడ్డా



దిల్లీ: భాజపా జాతీయాధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా.. ప్రతిపక్షాలను ఉద్దేశిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. ఆయుష్మాన్ భారత్ అమలు చేయని పార్టీలు అధికారం నుంచి తొలగిపోయాయని వ్యాఖ్యానించారు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ వంతు వచ్చిందని అన్నారు. దిల్లీలోని ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

“ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య కవరేజ్ కార్యక్రమం. ఈ పథకం కింద ప్రస్తుతం 62 కోట్ల మందికి పైగా దీని ప్రయోజనాలు పొందుతున్నారు. తాజాగా దిల్లీలోని 36 లక్షల మంది ప్రజలకు ఆయుష్మాన్ భారత్ ఫలాలు దక్కుతుండడం గర్వించదగిన విషయం. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 8.19 కోట్ల మంది చికిత్స పొందారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.1.26 లక్షల కోట్లు ఖర్చు చేసింది” అని తెలిపారు. AB-PMJAY అనేది ఒక పథకం మాత్రమే కాదు ప్రజలకు మోదీ సర్కార్ భరోసా. దీని ద్వారా లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆరోగ్య కవరేజీని అందిస్తుంది. ప్రస్తుతం దిల్లీ ప్రభుత్వం దీనికి మరో రూ.5 లక్షలు జోడించి రూ.10 లక్షల కవరేజిని అందిస్తుంది. 2018లో ఈ పథకం ప్రారంభించినప్పటికీ.. ఆరు లక్షల మంది వృద్ధుల సహా 36 లక్షల మందికి పథక ప్రయోజనాలు అందలేదు. ఆ ఏడు ఏళ్లు దిల్లీకి చీకటి కాలం” అని గతంలో అధికారంలో ఉన్న ఆప్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

“ఆయుష్మాన్ భారత్‌ను అమలు చేయని రాష్ట్రాల్లో ఆ పార్టీలు ఓటమి పాలయ్యాయి. అధికారం కోల్పోయాయి. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ వంతు. ఆ పార్టీకి కూడా ఇలాంటి పరిస్థితి వస్తుంది ఇందులో ఎలాంటి సందేహం లేదు. అక్కడ భాజపా ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయం” అని నడ్డా ధీమా వ్యక్తం చేశారు.

## మేము చైనీయులం.. రెచ్చగొడితే భయపడం

### చైనా విదేశాంగ శాఖ



చైనా దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ టారిఫ్‌లపై ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ తీవ్రంగా స్పందించారు. తాము చైనీయులమని.. కవ్వింపు చర్యలకు భయపడమని పేర్కొంటూ ఒక పాత వీడియోను ఆమె పంచుకున్నారు.

డ్రాగన్ దిగుమతులపై 125 శాతం సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై నింగ్ ఎక్స్ వేదికగా ఒక పోస్టు చేశారు. ‘మేము చైనీయులం. కవ్వింపు చర్యలకు భయపడం. టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గం’ అని పేర్కొన్నారు. దీనికి ఆమె 1953 నాటి వీడియోను పంచుకున్నారు. నాడు కొరియా యుద్ధం నేపథ్యంలో డ్రాగన్ నాయకుడు మావో జెడాంగ్ ప్రసంగించిన వీడియో అది. అందులో ‘ఈ యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందో మేము నిర్ణయించలేం.. అది వాళ్ల (అమెరికా) ఇష్టం. ఇది ఎంతకాలం సాగినా మేము వెనక్కి తగ్గం. పూర్తిగా విజయం సాధించేవరకు పోరాడతాం’ అని జెడాంగ్ పేర్కొన్నారు.

## చైనాపై సుంకాలు 145 శాతం.. క్లారిటీ ఇచ్చిన వైట్‌హౌస్

వాషింగ్టన్ డీసీ: అమెరికా– చైనా మధ్య సుంకాల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా చైనా ఉత్పత్తులపై సుంకాలను 145 శాతానికి పెంచినట్లు అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌస్ వెల్లడించింది. చైనా దిగుమతులపై ఉన్న 20 శాతం సుంకాలకు అదనంగా 34 శాతం విధిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ ప్రకటించడంతో ఆ రెండు దేశాలూ వాణిజ్య యుద్ధానికి ఢీ అంటే ఢీ అంటున్న విషయం తెలిసిందే. అమెరికా చర్యలకు దీటుగా స్పందిస్తున్న చైనా.. ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని నిర్ణయించింది. బీజింగ్ చర్యపై తీవ్రంగా ప్రతిస్పందించిన ట్రంప్.. చైనాపై టారిఫ్‌లను ఇటీవలే ఏకంగా 125శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. తాజాగా చైనాపై విధించిన సుంకాలు మొత్తంగా 145 శాతానికి చేరుకున్నట్లు వైట్‌హౌస్ స్పష్టం చేసింది. అటు చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించింది.

## ఏఐ రాకతో సాంకేతిక యుద్ధం జరుగుతోంది: రాజ్‌నాథ్



చెన్నై: రాజకీయ, సైనిక లక్ష్యాలను సాధించుకునేందుకు కొందరు సైబర్ దాడులను సాధనాలుగా వినియోగిస్తున్నారని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం కూడా ఇందులో ఓ భాగమని వ్యాఖ్యానించారు. తమిళనాడులోని డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంఘర్షణలు, పరిస్థితులు సంప్రదాయ యుద్ధాలకు భిన్నంగా మారుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. “నానాటికీ అభివృద్ధి చెందుతున్న సాంకేతికత మానవ ప్రమేయం లేని వ్యవస్థను సృష్టిస్తోంది. చాలా విషయాలను ఏఐ అంచనా వేయడం చూస్తున్నాం. ఇప్పుడు సంప్రదాయ యుద్ధాలు (భూమి, జల, వాయు మార్గాల్లో చేసే యుద్ధం) చేసుకునే కాలం పోయింది. ఏఐ రాకతో సాంకేతిక యుద్ధం జరుగుతోంది” అని ప్రసంగించారు.

“ప్రస్తుతం మనమంతా ‘గ్రే జోన్’, హైబ్రిడ్ యుద్ధ శకంలో ఉన్నాము. రాజకీయ, సైనిక లక్ష్యాలను సాధించుకోవడానికి కొందరు సైబర్ దాడులను వినియోగిస్తున్నారు. ఆర్థిక యుద్ధం అనేది ఒక్క తూటా కూడా పేల్చకుండా రాజకీయ, సైనిక లక్ష్యాలను అమలుచేయగలవు. అందుకే వీటిని సాధనాలుగా మలుచుకుంటున్నారు. సైబర్, అంతరిక్షం, సమాచార యుద్ధాలు కూడా సంప్రదాయ యుద్ధంలా ఎంతో శక్తిమంతమైనవి. వీటితో పోరాడేందుకు బహుళ– డొమైన్ వాతావరణంలో సాయుధ దళాలు కలసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది” అని నొక్కి చెప్పారు. “మన పొరుగునున్న ప్రాంతాల నుంచి మనపై పరోక్ష యుద్ధం జరుగుతోంది. అక్కడినుంచి ఉగ్రవాద ముప్పుతో ఇది మరింత తీవ్రమవుతోంది. సైబర్ దాడులకు బలికాకుండా ఉండాలంటే మనమంతా కలిసి పోరాడాలి” అని అన్నారు.

## అమెరికాలో వ్యభిచార గృహాలతో సంబంధాలు.. భారత సంతతి సీఈఓ అరెస్ట్



అమెరికాలో వ్యభిచార గృహాలతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో భారత సంతతి సీఈఓ అరెస్టయ్యారు. క్లీన్ వాటర్ స్టార్టప్ గ్రేడియంట్ సీఈఓగా పనిచేస్తోన్న అనురాగ్ బాజ్‌పాయ్ ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు న్యూయార్క్ పోస్ట్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఆ వ్యభిచార గృహాల్లో గడిపి, ఎక్కువ మొత్తంలో చెల్లించిన క్లైంట్ల జాబితాలో ఆయన పేరు కూడా ఉందని బోస్టన్ ఏరియా కోర్టుకు సమర్పించిన పత్రాల్లో ఉన్నట్లు పేర్కొంది. వైద్యులు, న్యాయవాదులు, ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ కాంట్రాక్టర్లకు చెందిన ప్రత్యేక క్లైంట్ల గ్రూప్‌లో అనురాగ్ పేరు ఉందని విచారణాధికారులు వెల్లడించారు. వీరు గంటకు 600 డాలర్లు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. వీరు ఎంచుకునే వారిలో ఆసియా మహిళలు ఉంటారని తెలిపారు. ఆ మహిళలు మానవ అక్రమరవాణా కారణంగా ఈ ఊబిలో చిక్కుకున్నారని భావిస్తున్నారు. ఈ వ్యవహారంలో తమ బాస్ పేరు ఉండటంతో గ్రేడియంట్ సంస్థ సిబ్బంది ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయితే సంస్థ మాత్రం అనురాగ్‌కు మద్దతు ప్రకటించడంతో పాటు న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని వ్యక్తంచేసింది.

## డిపోర్టేషన్ ఆపరేషన్.. 11వేల మంది శరణార్థుల్ని గెంటేసిన పాక్!



ఇస్లామాబాద్: అఫ్గానిస్థాన్ నుంచి వచ్చి తమ దేశంలో ఉంటున్న శరణార్థులపై పాకిస్థాన్ ‘బహిష్కరణ’ అస్త్రాన్ని ప్రయోగించింది. డిపోర్టేషన్ ప్రక్రియ ద్వారా వారిని స్వదేశానికి తరలిస్తోంది. శరణార్థులుగా వచ్చినవారు స్వచ్ఛందంగా తమ దేశాన్ని వీడేందుకు ఇచ్చిన డెడ్‌లైన్ ముగియడంతో పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైన డిపోర్టేషన్ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటివరకు 11వేల మందికి పైగా అఫ్గానీయులను బహిష్కరించినట్లు ప్రకటించింది.

అఫ్గాన్ సిటిజన్ కార్డు ఉన్నవారంతా మార్చి 31 నాటికి తమ దేశం విడిచి వెళ్లాలని.. లేదంటే బహిష్కరణ వేటు తప్పదని జనవరిలో పాకిస్థాన్ హెచ్చరించింది. తాజాగా వారిని బహిష్కరించే చర్యలను ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించింది. దీంతో ఇప్పటివరకు 11,230 మంది అఫ్గాన్ పౌరుల్ని వారి దేశానికి తిరిగి పంపినట్లు పాక్ హోం మంత్రి తలాల్ చౌధరి వెల్లడించారు. సరైన ధ్రువపత్రాల్లేని అఫ్గాన్ పౌరుల్ని తమ దేశంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. 2023లో తొలిసారి పాకిస్థాన్ బహిష్కరణ ప్రక్రియ ప్రారంభించిన తర్వాత 8,57,152 మంది పాక్‌ను వీడారన్నారు. సరైన ధ్రువపత్రాల్లేకుండా

అక్రమంగా ఉంటున్నవారిని మాత్రమే తొలి దశలో తిరిగి పంపినట్లు మంత్రి తెలిపారు. తమ దేశాల్లో పునరావాసం కల్పించేందుకు కట్టుబడిన అమెరికా, ఇతర పాశ్చాత్యాదేశాలు ఆయా దేశాల్లో పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఆయా దేశాలకు వెళ్లేవారికి ఏప్రిల్ 30వరకు డెడ్‌లైన్ విధిస్తున్నట్లు తెలిపారు. ఈ గడువును మరోసారి పొడిగించ బోమని స్పష్టం చేశారు.

## సుంకాలకు ట్రంప్ బ్రేక్.. వాల్‌స్ట్రీట్, ఆసియా మార్కెట్లలో జోష్



ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలను గడగడలాడించిన ట్రంప్ ఇప్పుడు కాస్త శాంతించారు. చివరి నిమిషంలో ఈ టారిఫ్ లను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అనూహ్య ప్రకటన చేశారు. ట్రంప్ సుంకాల దెబ్బతో గత కొన్ని రోజులుగా ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రపంచ మార్కెట్లు తాజా నిర్ణయంతో పుంజుకున్నాయి. అమెరికా మార్కెట్లు రికార్డ్ స్థాయిలో లాభాలను ఆర్జించగా.. ఆసియా మార్కెట్లు కూడా గురువారం రాణిస్తున్నాయి. నేటి ట్రేడింగ్‌లో జపాన్ నిక్కీ 8.2శాతం మేర లాభంతో కొనసాగుతోంది. అటు ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ 4.7శాతం, దక్షిణకొరియా కోస్పి 4.9శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీ 2.8శాతం మేర పెరిగాయి. తైవాన్ సూచీ 9.2శాతం లాభంతో దూసుకెళ్తోంది. షాంఘై సూచీ మాత్రం స్వల్పంగా 0.6శాతం లాభంతో కొనసాగుతోంది. అయితే, మహావీర్ జయంతి సందర్భంగా గురువారం భారత మార్కెట్లు పనిచేయవు.

**24 ఏళ్లలోనే బెస్ట్ డే..**

చైనా మినహా ఇతర దేశాలపై 90 రోజులపాటు 10% సుంకాలనే కొనసాగిస్తున్నామని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో బుధవారం అమెరికా స్టాక్ మార్కెట్లు భారీగా దూసుకెళ్లాయి. డోజోన్స్ 7.9శాతం, నాస్‌డాక్ ఏకంగా 12.2 శాతం, ఎస్అండ్‌పీ 500 సూచీ 9.5శాతం మేర ఎగబాకాయి. నాస్‌డాక్ ఒక రోజులో ఇలా రికార్డ్ స్థాయిలో లాభపడడం 24 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఇక, ఎస్అండ్‌పీ 500 సూచీకి 2008 తర్వాత నుంచి ఇది అతిపెద్ద రోజువారీ లాభం అని విశ్లేషకులు చెబుతున్నారు.

## తగ్గిన టీసీఎస్ లాభం.. ఒక్కో షేరుపై రూ.30 డివిడెండ్




టాటా గ్రూపునకు చెందిన ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి (జనవరి-మార్చి) గానూ కంపెనీ రూ.12,224 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 2 శాతం తగ్గింది. విశ్లేషకుల అంచనాలను అందుకోవడంలో విఫలమైంది.

ఇక ఆదాయం చూస్తే నాలుగో త్రైమాసికంలో రూ.64,479 కోట్లుగా నమోదైంది. గతేడాది రూ.61,237 కోట్లతో పోలిస్తే ఈ మొత్తం 5.3 శాతం మేర పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ టీసీఎస్ రూ.48,553 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఏడాది కాలంతో పోలిస్తే 5.76 శాతం మేర పెరిగింది. ఆదాయం 5.99 శాతం వృద్ధితో రూ.2,55,324 కోట్లకు పెరిగింది.

ఒక రూపాయి ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.30 చొప్పున తుది డివిడెండ్‌ను చెల్లించేందుకు కంపెనీ నిర్ణయించింది. కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. వరుసగా రెండో త్రైమాసికంలోనూ మెరుగైన ఆర్డర్ బుక్ సాధించామని కంపెనీ సీఈఓ కృతివాసన్ పేర్కొన్నారు. వార్షిక ఆదాయం 30 బిలియన్ డాలర్లను దాటడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు.

చివరి త్రైమాసికంలో కొత్తగా 625 మందిని మాత్రమే చేర్చుకున్నట్లు కంపెనీ చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ పేర్కొన్నారు. పూర్తి సంవత్సరానికి 6433 మందిని చేర్చుకోవడంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 6.07 లక్షలకు చేరిందన్నారు. 2024-25లో తాము 42 వేలమంది ట్రైనీలను ఆన్‌బోర్డ్ చేశామని పేర్కొన్నారు. ఫలితాల నేపథ్యంలో బుధవారం టీసీఎస్ షేరు ఎన్ఎస్ఈలో 1.64% తగ్గి రూ.3,239 వద్ద ముగిసింది.

## ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్ల ఫ్యూజ్‌లేజ్ తయారీ

**మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్**



దిల్లీ: ఒకే ఇంజిన్ ఉండే ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్ల కోసం ఫ్యూజ్‌లేజ్‌ను మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్ మన దేశంలో ఉత్పత్తి చేయనుంది. కర్ణాటకలోని కోలార్‌లో ఉన్న మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్ తయారీ కేంద్రంలో ఈ ఫ్యూజ్‌లేజ్‌లను ఉత్పత్తి చేయనున్నారు. ఏటా 60-70 వరకు హెచ్130 ఫ్యూజ్‌లేజ్‌లను ఉత్పత్తి చేయాలని మహీంద్రా భావిస్తోంది. ఒప్పందంలో భాగంగా హెచ్130 హెలికాప్టర్ ప్రధాన ఫ్యూజ్‌లేజ్‌ను ఉత్పత్తి చేసి, ఐరోపాలోని ఎయిర్‌బస్ హెలికాప్టర్ తయారీకేంద్రాలకు ఎగుమతి చేయనుంది. 2027 మార్చిలో మొదటి యూనిట్ డెలివరీ అయ్యే అవకాశం ఉంది. ఈ కాంట్రాక్టుకు సంబంధించి ఆర్థిక వివరాలను కంపెనీ వెల్లడించలేదు. ప్రస్తుతం ప్రపంచంలో ప్రాచుర్యం పొందిన హెలికాప్టర్లలో 8 సీట్లు కలిగిన హెచ్130 ఒకటి. రవాణా, పర్యాటకం, వైద్యం, నిఘా, ప్రైవేట్ విమానయాన కార్యకలాపాలకు ఈ హెలికాప్టర్లను వినియోగిస్తున్నారు.

# విలాసకార్ల విక్రయాలు అదుర్స్




దిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో విలాసకార్ల అమ్మకాలు సంతృప్తికరంగా పెరిగాయని ఆయా కంపెనీలు వెల్లడించాయి. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నా, దేశీయ ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండటం ఇందుకు కారణంగా చెబుతున్నారు.

మెర్సిడెస్ బెంజ్ విక్రయాలు 4% పెరిగాయ్: జర్మనీకి చెందిన కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో 18,928 కార్లను భారత్‌లో విక్రయించింది. వీటిలో ప్రతి 4 కార్లలో ఒకటి రూ.1.5 కోట్ల కంటే అధిక ధర కలిగినదే. 2023-24లో విక్రయించిన 18,123 కార్లతో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో 4.44% వృద్ధి నమోదైంది. జనవరి-మార్చి త్రైమాసికంలో చూస్తే విక్రయాలు 5,412 నుంచి 11.8% తగ్గి 4,775కు చేరాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రేట్ల కోత వల్ల, కార్లకు గిరాకీ పెరిగేందుకు దోహదం చేయనుందని కంపెనీ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ తెలిపారు.

19% పెరిగిన లెక్సస్ విక్రయాలు: విలాస కార్ల తయారీ సంస్థ లెక్సస్ ఇండియా రిటెయిల్ విక్రయాలు 2023-24తో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో 19% పెరిగాయి. జనవరి-మార్చి త్రైమాసికంలో 17% వృద్ధి చెందాయి. కచ్చితమైన విక్రయాల సంఖ్యను కంపెనీ వెల్లడించలేదు.

జేఎల్ఆర్ విక్రయాలు అదుర్స్: ఒక ఆర్థిక సంవత్సరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) 2024-25లో ఉత్తమ పని తీరు కనబర్చింది. గత ఆర్థిక సంవత్సరంలో 40 శాతం వృద్ధితో 6,183 వాహనాలను విక్రయించింది. డీలర్లకు సరఫరా చేసిన వాహనాలు సైతం 39% వృద్ధితో 6,266 కు చేరాయి.

## లులూ చేతికి మంజీరా మాల్




హైదరాబాద్: హైదరాబాద్ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులోని మంజీరా మాల్ యాజమాన్య సంస్థ అయిన మంజీరా రిటెయిల్ హోల్డింగ్స్‌ను ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్) నిర్వహించిన దివాలా ప్రక్రియలో లులూ ఇంటర్నేషనల్ షాపింగ్స్ మాల్స్ సొంతం చేసుకుంది. దీని కోసం ఎన్నో సంస్థలు పోటీ పడ్డాయి. లులూ ఇంటర్నేషనల్ షాపింగ్స్ మాల్స్ రూ.318.42 కోట్లకు, దివాలా పరిష్కార ప్రణాళికను దాఖలు చేసింది. కమిటీ ఆఫ్ క్రెడిటర్స్ (సీఓసీ) ఈ ప్రణాళికకు ఆమోదం తెలిపింది. కేటలిస్ట్ ట్రస్టీషిప్ లిమిటెడ్, ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ సీఓసీలో ఉన్నాయి. మంజీరా రిటెయిల్ హోల్డింగ్స్ తమవద్ద తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించకపోవడంతో కేటలిస్ట్ ట్రస్టీషిప్ గత ఏడాది జులైలో ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. దీన్ని ఎన్‌సీఎల్‌టీ అనుమతించడంతో పాటు దివాలా ప్రక్రియ నిర్వహించడానికి బీరేంద్ర కుమార్ అగర్వాల్‌ను రిజల్యూషన్ ప్రొఫెషనల్‌గా నియమించింది. ఆ తర్వాత బిడ్లు పిలవడం, ఆసక్తి గల సంస్థలతో సంప్రదింపులు సాగించడం, సీఓసీ సమావేశాలు నిర్వహించడం వంటి ప్రక్రియలను పూర్తి చేశారు. ఈ దశలన్నీ అధిగమించి లులూ ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్, మంజీరా రిటెయిల్ హోల్డింగ్స్‌ను సొంతం చేసుకుంది. కేపీహెచ్‌బీలోని మంజీరా మాల్‌ను కొంతకాలం క్రితం లులూ ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ లీజుకు తీసుకున్న విషయం విదితమే. ఇప్పుడు దీనికి యజమానిగా మారిపోయింది.

## డిస్క్ బ్రేక్‌తో హీరో స్ప్లెండర్ ప్లస్ 2025



ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ అత్యంత ప్రజాదరణ పొందిన తన స్ప్లెండర్ 2025 మోడల్‌ను విడుదల చేసింది. డిజైన్ పరంగా పెద్దగా మార్పులు చేయనప్పటికీ.. లుక్ పరంగా చిన్న చిన్న మార్పులు చేసింది. స్ప్లెండర్ లైనప్‌లో స్ప్లెండర్ ప్లస్, స్ప్లెండర్ ఎక్స్‌టెక్, స్ప్లెండర్ ప్లస్ ఎక్స్‌టెక్ 2.0 వేరియంట్లను తీసుకొచ్చింది.

పాత మోడళ్లకు ఏ ఇంజిన్ ఇచ్చారో స్ప్లెండర్ 2025 మోడళ్లలోనూ దాన్నే కొనసాగించారు. ఫేజ్-2 ఓబీడీ-2బి ప్రమాణాలకు అనుగుణంగా ఇంజిన్‌ను తీర్చిదిద్దారు. 2025 ఏప్రిల్ 1 తర్వాత విక్రయించే వాహనాలన్నీ ఈ ప్రమాణాలు పాటించాలని కేంద్రం తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. ఇందులో 4 స్పీడ్ గేర్ బాక్స్ ఉంది. ఇది 7.91 బీహెచ్‌పీ పవర్‌ను, 8.05ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. గ్రాఫిక్స్ పరంగా కొన్ని మార్పులు చేశారు. స్పోర్టీ లుక్‌ను జోడించారు. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, ఎల్ఈడీ డీఆర్ఎల్స్, ఫుల్లీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ వంటివి ఉన్నాయి. స్మార్ట్‌ఫోన్‌ను బ్లూటూత్‌తో కనెక్ట్ చేసుకునే సదుపాయం కూడా ఉంది. సీటు, లగేజీ ర్యాక్‌లో మార్పులు చేశారు. అయితే, ఇవి టాప్ ఎండ్ మోడళ్లకే పరిమితం.



# ట్రంప్‌పై ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలు!

భాగస్వామ్య దేశాలపై విధించిన సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. మొదటినుంచీ వెనక్కి తగ్గేది లేదంటూ ప్రకటనలు చేసిన ఆయన.. ఒక్క చైనా మినహా మిగిలిన దేశాలకు తాత్కాలిక ఊరట కల్పించారు. ఈ నేపథ్యంలో అమెరికా స్టాక్ మార్కెట్లు దూసుకెళ్లాయి. అయితే, సుంకాల మినహాయింపు ప్రకటన కంటే ముందు ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టు.. వివాదానికి కారణమైంది. ఆయన ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారంటూ డెమోక్రట్లు ఆరోపిస్తున్నారు.

వివిధ దేశాలపై సుంకాల వాయిదా ప్రకటనకు ముందు ఉదయం డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో అధికారిక హ్యాండిల్ నుంచి కొన్ని పోస్టులు పెట్టారు. "బి కూల్: అంతా సక్రమంగా జరుగుతుంది. అమెరికా ఇంతకుముందుతో పోలిస్తే మరింత మెరుగుగ్గా రాణిస్తుంది" అని తొలుత ఓ పోస్ట్ పెట్టారు. కాసేపటి తర్వాత "కొనుగోలు చేయడానికి ఇదే సరైన సమయం" అంటూ మరో పోస్ట్ పెట్టారు. చివర్లో DJT అని జోడించారు. డొనాల్డ్ ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ కార్పొరేషన్‌ను డీజేటీగా వ్యవహరిస్తారు.

అక్కడికి కొన్ని గంటల తర్వాత సుంకాలపై డొనాల్డ్ ట్రంప్ తన నిర్ణయం వెలువరించారు. ఈనేపథ్యంలో అమెరికా టెక్ సూచీ అయిన నాస్‌డాక్ 12 శాతం మేర రాణించింది. ఎస్అండ్‌పీ 500 సూచీ 9.5 శాతం, డోజోన్స్ 8 శాతం మేర లాభపడ్డాయి. డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన మీడియా కంపెనీ షేర్లు భారీగా పెరిగి 22.67 శాతం మేర లాభాల్లో ముగిశాయి. ఈ కంపెనీలో ట్రంప్‌నకు 53 శాతం మేర వాటా ఉంది. దీంతో ఆయన వ్యక్తిగత సంపద 415 మిలియన్ డాలర్ల మేరకు పెరిగింది. ఈ మీడియా సంస్థను ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ నిర్వహిస్తున్నారు. ట్రంప్ ఈ పిలుపునివ్వడం.. కొన్ని గంటల తర్వాత టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం.. ఆపై అమెరికా స్టాక్ మార్కెట్లు రాణించడం గమనార్హం.

**ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటున్న డెమోక్రట్లు**

ఈ నాటకీయ పరిణామాలపై డెమోక్రట్ సెనేటర్ ఆడమ్ స్కిఫ్ తొలుత దీనిపై గళమెత్తారు. ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని లేదా మార్కెట్ అవతవకలకు పాల్పడ్డారంటూ ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు

. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇదంతా చేస్తున్నారంటూ వర్జీనియాకు చెందిన మరో సెనేటర్ టిమ్ కైన్ ఆరోపించారు. మరికొందరు డెమోక్రట్లు సైతం ఇదేతరహా అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో ట్రంప్ పోస్ట్‌ను కామర్స్ సెక్రటరీ హోవర్డ్ లుట్నిక్ సమర్థించారు. అమెరికా గొప్ప దేశం అని చెప్పడం ఆయన ఉద్దేశమని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా దేశ ఆర్థికవ్యవస్థపై, మార్కెట్లపై నమ్మకాన్ని పాదుకొల్పే బాధ్యత ఆయనపై ఉందంటూ వైట్‌హౌస్ అధికార ప్రతినిధి కుష్ దేశాయ్ కూడా అధ్యక్షుడి చర్యను సమర్థించారు. మొత్తానికి ట్రంప్ పోస్ట్‌తో మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టినవారు మాత్రం భారీగా లాభపడ్డారని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

## టారిఫ్‌ల అంశాన్ని భారత్ జాగ్రత్తగా హ్యాండిల్ చేస్తోంది

**పీయూష్ గోయల్**



ముంబయి: అమెరికా సుంకాల విషయంలో భారత్ చాలా తెలివిగా వ్యవహరిస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. అమెరికాతో వాణిజ్యాన్ని రెండున్నర రెట్లు పెంచుకోవడంపై తాము దృష్టి సారించామని పేర్కొన్నారు. వివిధ దేశాలపై విధించిన సుంకాలను ట్రంప్ 90 రోజుల పాటు నిలిపివేసిన వేళ ఆయన ముంబయిలో విలేకరులతో మాట్లాడారు.

ఇరు దేశాలపై మధ్య ద్వైపాక్షి సంబంధాలను, సులభతర వాణిజ్యం కోసం ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో ఇరు దేశాలు ఫిబ్రవరిలోనే ఓ ఒప్పందం చేసుకున్నాయని గోయల్ అన్నారు. దీనివల్ల ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. గతంతో పోలిస్తే ఈ మొత్తం రెండున్నర రెట్లు అధికం అన్నారు. దీనివల్ల మరింత మంది ఉద్యోగ అవకాశాలు వస్తాయని,

దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతి ఉందని, ఇందులో భారత్‌దే పైచేయి అని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. అంతకుముందు వాణిజ్య ఒప్పందాలపై పరిశ్రమ వర్గాల ప్రతినిధులతో భేటీ అయిన ఆయన.. వాణిజ్యం గురించి మాట్లాడారు. ప్రభుత్వానికి దేశ ప్రయోజనాలే ముఖ్యమని, వికసిత భారత్ 2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ ద్వైపాక్షిక ఒప్పందం దోహదపడుతుందని పీయూష్ గోయల్ అన్నారు.

# విశ్వంభర రామగీతం

చిరంజీవి



చిరంజీవి కథానాయకుడిగా... యు.వి.క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర'. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. కునాల్ కపూర్ కీలకపాత్ర పోషిస్తున్నారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమాలోని 'రామ... రామ...' అంటూ సాగే పాటని ఈ నెల 12న విడుదల చేస్తున్నారు. ప్రత్యేకమైన పోస్టర్‌తో ఈ విషయాన్ని ప్రకటించాయి సినీ వర్గాలు. భక్తి ప్రధానంగా సాగే ఈ పాట, చిత్రీకరణ మనసుల్ని హత్తుకునేలా ఉంటుందని... ఈ పాటతోనే ప్రచార కార్యక్రమాల్ని మొదలుపెట్టినట్టు సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఛాయాగ్రహణం: ఛోటా కె.నాయుడు, ప్రొడక్షన్ డిజైన్: ఎ.ఎస్.ప్రకాశ్.

# ప్రియాంకని సంప్రదించారా?

అల్లు అర్జున్ – అట్లీ కలయికలో తెరకెక్కనున్న సినిమాని ఇటీవలే అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా చర్చల దశలో ఉన్నప్పుడే పలు విషయాలు ప్రచారంలోకి వచ్చాయి. అల్లు అర్జున్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని, ఇందులో హాలీవుడ్‌లోనూ రాణిస్తున్న బాలీవుడ్ తార ప్రియాంక చోప్రా నటిస్తున్నారని.. ఇలా ఎన్నో సంగతులు వినిపించాయి. వీటిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ సినిమాని అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తున్నారు. ప్రపంచ మార్కెట్‌పై దృష్టిపెట్టి తీస్తున్న సినిమా కావడంతో, హాలీవుడ్‌లో గుర్తింపున్న ప్రియాంక చోప్రా ఎంపికపైన దృష్టిపెట్టే అవకాశాలే ఎక్కువనేది పరిశ్రమ వర్గాల మాట. ప్రియాంక ఇప్పటికే మహేశ్‌బాబు – రాజమౌళి కలయికలో రూపొందుతున్న సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. మరి అల్లు అర్జున్ సరసన కూడా ఆమె మెరుస్తారా అనేది చూడాలి. సన్‌పిక్చర్స్ నిర్మిస్తున్న అల్లు అర్జున్ – అట్లీ కలయికలో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది చివరి నుంచి ప్రారంభం అవుతుంది.



# విజయ యాత్రకు చిన్న విరామం



వరుసగా మూడు బ్లాక్ బస్టర్స్ సొంతం చేసుకుని... ఇండియాస్ నంబర్ ఒన్ హీరోయిన్ ట్యాగ్ రెడీ చేసుకుంటున్న తరుణంలో "సికందర్" చిత్రం రష్మిక కెరీర్ కి స్పీడ్ బ్రేకర్ గా నిలిచింది. అయితేనేం... రష్మిక చేతిలో ప్రస్తుతం 4 సినిమాలున్నాయి. వాటిలో ఒకటి.. రష్మిక స్టార్ డమ్ కు అద్దం పట్టే హీరోయిన్ ఓరియంటెడ్ ఫిల్మ్ కావడం గమనార్హం. "గర్ల్ ఫ్రెండ్" కాకుండా "కుబేర, థామా, రెయిన్ బో" చిత్రాలు వివిధ దశల్లో ఉండగా... డిస్కషన్ దశలో ఓ రెండు భారీ బడ్జెట్ చిత్రాలు ఉండడం గమనార్హం!!



# కేన్స్‌కు జాన్వీ చిత్రం.. భారతీయ సినిమా ప్రపంచాన్ని ఆకర్షిస్తోందంటూ పోస్ట్

నీరజ్ ఘైవాన్ దర్శకత్వంలో వచ్చిన రెండో చిత్రం 'హోమ్ బౌండ్'. ఈ సినిమాలో ఇషాన్ ఖట్టర్, జాన్వీకపూర్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పుడీ సినిమా ఈ ఏడాది కేన్స్‌లో ప్రదర్శితం కానుంది. ఈ విషయంపై ఆనందం వ్యక్తంచేస్తూ జాన్వీకపూర్ పోస్ట్ పెట్టారు.

"భారతీయ సినిమా ప్రపంచాన్ని ఆకర్షించే క్షణాలివి. 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'హోమ్ బౌండ్' సందడి చేయనుంది. ఇది మా టీమ్‌కు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. మా హృదయాలు ఆనందంతో నిండిపోయాయి. దీన్ని మీ అందరి ముందుకు తీసుకురావడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం" అని ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. ఇక ఈ ఏడాది కేన్స్‌కు ఎంపికైన ఏకైక భారతీయ చిత్రం ఇదే కావడం విశేషం. దీనిపై నిర్మాత కరణ్ జోహార్ కూడా స్పందించారు. 'భారతీయ సినిమా శక్తికి 'హోమ్ బౌండ్' నిదర్శనం. మన కథల గొప్పతనం ప్రపంచానికి తెలుస్తోంది. ఈ విజయం మనం చిత్ర పరిశ్రమది. రానున్న చిత్రాలకు ఇది ఆశాకిరణం' అని ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు.

హైదరాబాద్‌కు చెందిన నీరజ్ దర్శకత్వంలో వచ్చిన తొలి చిత్రం కూడా కేన్స్‌లో ప్రదర్శించారు. 2015లో ఇండస్ట్రీకి వచ్చిన ఆయన 'మసాన్' చిత్రం తెరకెక్కించారు. రిచా చద్దా, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా 2015లో కేన్స్‌లో ప్రదర్శించారు. ఇప్పుడు రెండో సినిమా కూడా ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపిక కావడంతో ఆయన్ని అందరూ అభినందిస్తున్నారు. 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఈ ఏడాది మే 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్ వేదికగా జరగనుంది. ఈ చిత్రోత్సవాలకు సంబంధించిన వివరాలను నిర్వాహకులు గురువారం వెల్లడించారు.


# సూపర్ నేచురల్ ప్రేమకథ

దేవన్ హీరోగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'కృష్ణ లీల'. తిరిగొచ్చిన కాలం.. అన్నది ఉపశీర్షిక. జి.జ్యోత్స్న నిర్మాత. ధన్య బాలకృష్ణన్ కథానాయిక. ఈ చిత్ర టైటిల్, మోషన్ పోస్టర్‌ను గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ వేడుకలో హీరో నిఖిల్‌తో పాటు ఎల్వీ గంగాధర్ శాస్త్రి, ఛోటా కె.నాయుడు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో నిఖిల్ మాట్లాడుతూ.. "మోషన్ పోస్టర్ నాకు బాగా నచ్చింది. దీంట్లో దేవన్ పాత్రలోని భిన్న కోణాలు చాలా నచ్చాయి. సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు. "ఈ చిత్రం నిజంగా ఓ అద్భుతం. జీవితంలో ప్రతి ఒక్కర్నీ కనెక్ట్ చేసే అంశాలు దీంట్లో ఉన్నాయి" అన్నారు నిర్మాత జ్యోత్స్న. హీరో, దర్శకుడు దేవన్ మాట్లాడుతూ.. "ఇదొక సూపర్ నేచురల్ లవ్‌స్టోరీతో రూపొందుతోంది. తప్పకుండా అందరికీ



నచ్చేలా ఉంటుంది. ఈ చిత్ర విషయంలో ఛోటా కె.నాయుడు, గంగాధర్ శాస్త్రి విలువైన సూచనలిచ్చారు" అన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్ ముత్యాల, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త దర్శకుడితో..?



అగ్ర కథానాయకుడు నాగార్జున నుంచి సోలో సినిమా వచ్చి చాలా రోజులైంది. 'నా సామిరంగ' తర్వాత ఆయన మరో సినిమా చేయలేదు. ధనుష్‌తో కలిసి 'కుబేర', రజనీకాంత్‌తో కలిసి 'కూలీ'లో నటిస్తున్నారు. అయితే ఈ మధ్యే ఆయన సోలోగా చేయనున్న సినిమాపై ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఓ కొత్త దర్శకుడు చెప్పిన కథకి పచ్చజెండా ఊపినట్టు తెలుస్తోంది. కథపై ఇంకొన్ని చర్చలు జరిపాక ఆయన ఈ సినిమాని ప్రకటించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,